ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 26.06.2026 | సంపుటి : 12 సంచిక : 337 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రమాదబీమా

### రూ.కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభం



హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల ప్రమాదబీమా పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రివివేక్, అధికారులు తదితరులు

- రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులే కీలకం
- అందుకే వారి సంక్షేమానికి పెద్దపీట
- కష్టపడి పనిచేసే రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలి
- పన్నులు ఎగవేసే వారిని పట్టుకుని వసూలు చేయాలి
- నేను గుంపు మేస్త్రీనే.. నా గుంపులో ఉన్నవారంతా బాగా పనిచేస్తారు
- ఇబ్బందులున్నా.. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతం ఇస్తున్నాం
- ఫాంహౌస్‌లో ఉన్నవాళ్లకు మూసీ, మెట్రోతో పనిలేదేమో.. కానీ పేదలకు అవసరం
- రవీంద్రభారతి వేదికగా బీమాపథకం ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్,జూన్25(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బీమా పథకాన్ని గురువారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ మిగతా 2లో..

"పీఆర్‌సీ విషయంలో కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. ఉద్యోగుల విశ్వాసమే ఈ ప్రభుత్వ బలం. అందరం అదనంగా మరోగంట కష్టపడి పనిచేద్దాం. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం అమలులో ఉద్యోగుల శ్రమ, సేవ ఉంది. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది ఉద్యోగుల వల్లే అని విశ్వసిస్తున్నా. కాంగ్రెస్ మరోసారి గెలిస్తే అది కూడా ఉద్యోగుల వల్లే అని నమ్ముతాను" - సీఎం రేవంత్ రెడ్డి,

## పంచాయితీలు కాదు..పరిష్కారాలు ముఖ్యం

- జల వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుందాం
- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- తుంగభద్రలో 15 టీఎంసీలకు.. 5 టీఎంసీలే అందుతున్నాయి
- మునీరాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బళ్లారి,జూన్25(జనంసాక్షి): తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ మిగతా 2లో..



తుంగభద్ర డ్యాం గేట్లను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పాటిల్.కర్ణాటక, ఏపీ,తెలంగాణ ముఖ్యమంత్రులు డీకే, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి

### తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

మూడు రాష్ట్రాల సీఎంలు డీకే , రేవంత్‌రెడ్డి, చంద్రబాబులచే ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్

2లో..

## వరుస భూకంపాలతో వణికిన వెనెజువెలా




### క్షణాల వ్యవధిలోనే రెండు భారీ ప్రకంపనలు

### రిక్టర్ స్కేలుపై 7.1, 7.5 తీవ్రతలతో నమోదైన ప్రకంపనలు

164 మందికిపైగా మృతి..

- వందల సంఖ్యలో క్షతగాత్రులు
- జాతీయ సెలవుదినం కావడంతో పెరిగిన ప్రాణ నష్టం
- ఊగిపోయిన భవనాలు.. ముక్కలైన రోడ్లు
- కరాకస్‌లో కుప్పకూలిన బహుళ అంతస్తు భవనాలు
- మరుభూమిని తలపిస్తున్న తీరనగరమైన 'లా గువైరా'
- భయంతో పరుగులు తీసిన జనం
- శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్
- జపాన్‌లోనూ సంభవించిన భూకంపం





భూకంపానికి ముందు పదంస్తుల భవనం.. తర్వాత కాంక్రీటు దిబ్బలా



### వెనెజువెలాకు ఆపన్నహస్తం

సాయం అందిస్తామని ప్రపంచదేశాల ప్రకటన

సాయం కోసం సిద్ధంగా ఉన్నామన్న, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్

2లో..

కరాకస్(జనంసాక్షి):దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను క్షణాల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు వణికించాయి. భూ ప్రకంపనల ధాటికి దేశ రాజధాని కరాకస్‌లోని భవనాలు ఊగిపోయాయి. దీంతో ప్రజలంతా భయాందోళనతో పరుగులు పెట్టారు. అనేకమంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. తొలి భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రతతో 7.5గా నమోదైనట్లు యూఎస్ జియోలజికల్ సర్వే తెలిపింది. దేశ కరేబియన్ తీరంలోని మోరోన్ ప్రాంతానికి పశ్చిమాన సుమారు 28 కిలోమీటర్ల దూరంలో, 13 కిలోమీటర్ల లోతులో తొలి భూకంప కేంద్రం గుర్తించినట్లు వెల్లడించింది. భూకంపం ధాటికి వెనెజువెలా రాజధాని కరాకస్‌లో బహుళ అంతస్తు భవనాలు మిగతా 2లో..

## వాణిజ్య సిలిండర్‌పై ఆంక్షలు ఎత్తివేత

ఎల్‌పీజీ సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎల్‌పీజీ సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కమర్షియల్ సిలిండర్ వినియోగదారులైన హోటళ్లు, రెస్టరంట్లు, ఇతర వ్యాపారులకు ఊరట కల్పిస్తూ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా రంగాల వారీగా విధించిన ఆంక్షలను ఎత్తివేసింది. అంతర్జాతీయంగా ఇంధన సరఫరాకు ఆటంకాలు తొలగడం, దేశీయంగా ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మిగతా 9లో..



## తెలంగాణలో ప్రారంభమైన సర్



- జులై 24 వరకు కొనసాగనున్న ఓటరు సవరణ ప్రక్రియ
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయనున్న బీఎల్‌వోలు
- అత్యవసర సేవల కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్న అధికారులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-సర్) సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఇవాళ్టి నుంచి జులై 24 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా.. హిమాయత్ నగర్ వార్డు కార్యాలయంలో బీఎల్ఓలకు ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులు అందజేశారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అందజేస్తారు. ఓటర్లే ఈ దరఖాస్తులను పూర్తి చేసి... బీఎల్ఓలకు అందజేయాలని అధికారులు తెలిపారు. రెండు రోజుల తర్వాత బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరిస్తారు. ఏదైనా అత్యవసర సేవల కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని కోరారు. ఒక వేళ బీఎల్ఓలు ఇంటికి రాకపోయినా.. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇంగ్లిష్‌లో, మిగతా జిల్లాల్లో తెలుగులో పత్రాలను అందించనున్నారు. బీఎల్‌వోలు ప్రతిరోజు కనీసం ఒక్కో బూత్ మిగతా 9లో..

## ఫీజు బకాయిల జాప్యమెందుకు?

- మీరు చెల్లించకుండా... విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే ఎలా?
- బకాయిలపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- త్వరగా కళాశాలలకు చెల్లించాలని ఆదేశం

హైదరాబాద్,జూన్25(జనంసాక్షి):తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే కళాశాలను వారు ఎలా నడుపుతారు? మిగతా 9లో..



## 48 బిలియన్ డాలర్లు

- భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు
- ప్రధాని మోదీతో సంస్థ సీఈవో సమావేశం



న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ గురువారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఏఐ, క్లౌడ్ సేవలను భారత్‌లో భారీగా విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రానున్న 5 ఏళ్లలో అదనంగా 13 బిలియన్ డాలర్ల (రూ.1.22 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. ఆరు నెలల క్రితం దేశంలో 35 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని అమెజాన్ వెల్లడించగా.. తాజా ప్రకటనతో తమ మొత్తం పెట్టుబడి ప్రణాళికలు 48 బిలియన్ డాలర్లకు (రూ.4.53 లక్షల కోట్లు) చేరాయని అమెజాన్ సీఈవో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా మోదీతో కలిసిన ఫొటోలను పంచుకున్నారు."భారత్‌లో దీర్ఘకాల వాణిజ్యానికి అమెజాన్ కట్టుబడి ఉంది. 2030 నాటికి ఏఐ, క్లౌడ్ సేవలను భారీగా విస్తరించనుంది. ఇందుకోసం 48 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాం. 2030 నాటికి 38 లక్షల ఉద్యోగాలను కల్పిస్తాం. 80 బిలియన్ డాలర్ల ఇ-కామర్స్ ఎగుమతులను సృష్టిస్తాం. 1.5 కోట్ల మిలియన్ చిన్న వ్యాపారులకు, 40 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ ప్రయోజనాలను అందిస్తాం" అని ఆండీ జెస్సీ ఎక్స్ వేదికగా తెలిపారు."హైదరాబాద్, ముంబయిలోని ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ల విస్తరణకు ఈ పెట్టుబడులు ఉపయోగించనున్నాం. దీని వల్ల భారత్‌లోని స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఏఐ, క్లౌడ్ సేవలను అందిస్తాం" అని అమెజాన్ పేర్కొంది. అమెజాన్ భారీ పెట్టుబడులను మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆండీ జెస్సీతో గొప్ప భేటీ జరిగింది. భారత్‌లో అమెజాన్ పెట్టుబడులను స్వాగతిస్తున్నాం. దీంతో యువతకు కొత్త అవకాశాలు ఏర్పడుతాయి. భారత్‌లో పెట్టుబడులకు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం" అని తెలిపారు.

'అంత్యోదయ'లో మార్పులు..

## ఇకపై వ్యక్తికి 7 కేజీల రేషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అంత్యోదయ అన్న యోజనలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురానుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ పథకం లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు ఇచ్చేలా పథకంలో మార్పు చేయబోతోంది. 35 కిలోల గరిష్ఠ పరిమితిని మాత్రం యథాతథంగా కొనసాగించాలనుకుంటోంది. ఈ మేరకు జాతీయ ఆహార భద్రత చట్టం, 2013ను సవరించాలని భావిస్తోంది. దీనిపై జులై 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ప్రస్తుతం అంత్యోదయ అన్న యోజన కింద పేదరికంలో ఉన్న కుటుంబాలకు కుటుంబసభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మిగతా 9లో..

## ఇందిరమ్మ వల్లే ఎస్టీ రిజర్వేషన్లు



అభివృద్ధిని ఓర్వేలేకపోతున్న కేటీఆర్ హరీశ్‌రావు

ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్,జూన్25(జనంసాక్షి) ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ మిగతా 9లో..

## పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు



2లో..

## స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించండి

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో హైకోర్టు ఆదేశం

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
26.06.2026

# తెలంగాణ ప్రభుత్వము
## జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
## నాగర్ కర్నూల్ జిల్లా

No.G2/769/2026 తేది: 12.06.2026
Gaz. No. 91/2026

భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం-6**
**ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని **రామాజిపల్లి@కొండరెడ్డిపల్లి** గ్రామము వద్ద **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్** క్రింద **పెనిమిల్ల కెనాల్ నిర్మాణ నిమిత్తము రామాజిపల్లి@కొండరెడ్డిపల్లి** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ. 10.03** గుంటలు/ సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్** క్రింద **పెనిమిల్ల కెనాల్** నిర్మాణ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని **ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి యూనిట్ -1** నాగర్ కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 10.03 గు॥** భూమి **అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్** క్రింద **పెనిమిల్ల కెనాల్ నిర్మాణ నిమిత్తం** భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము: రామాజిపల్లి@కొండ రెడ్డిపల్లి మండలం: బల్మూర్ జిల్లా: నాగర్ కర్నూల్

| క్రమ సం. | సర్వే నెం. ఎస్. డి. నెం. | పట్టా / ఇనాం etc., | భూ వర్గీకరణ మెట్ట / ఆరుతడి / తరి | భూ సేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారురు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 296 | పట్టా | మెట్ట | 2.12 | తగుల్ల కొండల్ తండ్రి లింగయ్య (0.04)<br>తగుల్ల లక్ష్మయ్య తండ్రి లింగయ్య (0.23)<br>లింగయ్య తండ్రి (0.05)<br>జబ్బు శంకర్ తండ్రి నిరంజన్ (0.30)<br>జబ్బు సత్యనారాయ్య తండ్రి నిరంజన్ (0.30)<br>జబ్బు నిరంజన్ తండ్రి బాల్ లింగయ్య<br>బి. బాలమ్మ భర్త రాములు<br>బి. సలేశ్వరం తండ్రి లింగయ్య<br>బోయిని బొజ్జమ్మ భర్త హుసేన్<br>తగుల్ల సువర్ణ భర్త లక్ష్మయ్య<br>బోయిని మల్లేష్ యాదవ్ తండ్రి సలేశ్వరం | 294 | 43 | 288 | 287 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 295 | పట్టా | మెట్ట | 0.36 | హుసేన్ తండ్రి (0.20)<br>తగుల్ల కొండల్ తండ్రి లింగయ్య (0.12)<br>తగుల్ల లక్ష్మయ్య తండ్రి లింగయ్య (0.04)<br>బి. గోవర్ధన్ తండ్రి నర్సింహులు<br>బి. కృష్ణయ్య తండ్రి నర్సింహులు<br>బి. కిష్టమ్మ భర్త శివయ్య<br>బి. లక్ష్మి భర్త వెంకటయ్య<br>బి. తిరుపతయ్య తండ్రి రాములు<br>వెంకటయ్య తండ్రి రాములు<br>శేఖర్ తండ్రి నిరంజన్<br>బి. లక్ష్మమ్మ భర్త చెన్నయ్య<br>బి. చెన్నయ్య తండ్రి కిష్టయ్య<br>జి. అంజనేయులు తండ్రి బాల్‌రాం<br>బి. తిరుపతయ్య తండ్రి నారాయణ<br>బి. సాయికుమార్ తండ్రి బి. నారయ్య<br>యం. బాల్ రాం తండ్రి బక్కయ్య | 291 | 296 | 290 | 294 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 289 | పట్టా | మెట్ట | 0.21 | సత్యనారాయణ తండ్రి రాములు (0.01)<br>బైనీ చిన్న సలేశ్వరం తండ్రి లింగయ్య (0.02)<br>బైనీ సలేశ్వరం తండ్రి రాములు (0.18)<br>బి. బాలమ్మ భర్త రాములు<br>టి. లింగయ్య తండ్రి సలేయ్య<br>బి. బొజ్జమ్మ భర్త హుసేన్<br>టి. సువర్ణ భర్త లక్ష్మయ్య<br>బి. మల్లేష్ యాదవ్ తండ్రి సలేశ్వరం | 286 | 288 | 287 | 295 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 290 | పట్టా | మెట్ట | 0.34 | బైనీ చిన్న సలేశ్వరం తండ్రి (0.34)<br>బి. సలేశ్వరం తండ్రి లింగయ్య<br>బైనీ సలేశ్వరం తండ్రి రాములు<br>సత్యనారాయణ తండ్రి రాములు<br>బి. బొజ్జమ్మ భర్త హుసేన్<br>టి. సువర్ణ భర్త లక్ష్మయ్య<br>బి. మల్లేష్ యాదవ్ తండ్రి సలేశ్వరం<br>యం. లక్ష్మయ్య తండ్రి నాగయ్య | 291 | 289 | 286 | 295 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 286 | లావుణి పట్టా | మెట్ట | 0.13 | ఇతరులు (0.13)<br>యండి. ఖాజామైనోద్దీన్ తండ్రి యండి.ఖాశీం అలీ<br>సాదె రాజు తండ్రి సాదె రామేశ్వర్<br>ప్రభుత్వ భూమి | 281 | 289 | 286 | 290 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 281 | పట్టా | మెట్ట | 2.23 | శంకరయ్య తండ్రి (0.01)<br>గోవిందు నారయ్య తండ్రి (0.21)<br>శంకరయ్య తండ్రి (0.16)<br>పుల్లయ్య తండ్రి నారయ్య (0.16)<br>అబ్బయ్య తండ్రి రాంచంద్రయ్య (0.16)<br>నరేష్ తండ్రి తిరుపతయ్య (0.16)<br>సాయిబాబు తండ్రి సింగోటం (0.17)<br>బి. సలేశ్వరం తండ్రి లింగయ్య<br>బైనీ సలేశ్వరం తండ్రి రాములు<br>సత్యనారాయణ తండ్రి రాములు<br>బి. హుసేన్ తండ్రి నారాయణ<br>బి. మల్లేష్ యాదవ్ తండ్రి సలేశ్వరం | 279 | 285 | 282 | 291 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 279 | పట్టా | మెట్ట | 0.05 | గోవిందు నారయ్య తండ్రి (0.05)<br>కె. కుమారస్వామి తండ్రి కిష్టయ్య<br>జి. పుల్లయ్య తండ్రి నారాయణ<br>కె.లక్ష్మీనారాయణ తండ్రి కిష్టయ్య<br>కె. వెంకటస్వామి తండ్రి కిష్టయ్య<br>పి. నరేష్ తండ్రి తిరుపతయ్య<br>పి. అనిల్ తండ్రి తిరుపతయ్య<br>పి. జయమ్మ భర్త తిరుపతయ్య<br>పి. కళమ్మ భర్త నర్సయ్య<br>పి. అంబయ్య తండ్రి రామచంద్రం<br>పి. నర్సయ్య తండ్రి నారాయణ<br>జి. రమేష్ తండ్రి పుల్లయ్య<br>పి. శివ తండ్రి సాయిబాబు<br>కె. శ్రీనివాసులు తండ్రి కిష్టయ్య<br>పి. లక్ష్మమ్మ భర్త పి. తిరుపతయ్య | 277 | 281 | 280 | 278 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 280 | పట్టా | మెట్ట | 2.19 | చంద్రమౌళి తండ్రి తిరుపతయ్య (0.35)<br>సుధాకర్ తండ్రి అబ్బయ్య (0.34)<br>తిరుపతయ్య తండ్రి అంబయ్య (0.02)<br>రాంచంద్రయ్య తండ్రి నారయ్య (0.14)<br>సాయిబాబు తండ్రి సింగోటం (0.14)<br>జి. పుల్లయ్య తండ్రి నారాయణ<br>జి. భాగ్యమ్మ భర్త పుల్లయ్య<br>కె. లక్ష్మీనారాయణ తండ్రి కిష్టయ్య<br>జి. లక్ష్మయ్య తండ్రి నారాయణ<br>కె. వెంకటస్వామి తండ్రి కిష్టయ్య<br>పి. నరేష్ తండ్రి తిరుపతయ్య<br>పి. అనిల్ తండ్రి తిరుపతయ్య<br>పి. జయమ్మ భర్త తిరుపతయ్య<br>పి. కళమ్మ భర్త నర్సయ్య<br>పి. అంబయ్య తండ్రి రామచంద్రం<br>పి. నర్సయ్య తండ్రి నారాయణ<br>ఎ. తేజస్వి భర్త సుదర్శన్<br>పి. జయమ్మ భర్త సాయిబాబు<br>కె. బాగ్యమ్మ భర్త కుమారస్వామి<br>కె. శ్రీనివాసులు తండ్రి కిష్టయ్య | 349 | 282 | 283 | 277 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తము | | 10.03 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, **ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., యూనిట్ -1 నాగర్ కర్నూల్,** మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సెక్షన్ 26 (3) ననుసరించి నిర్దేశిత నష్టపరిహారము సంబందిత భూ నిర్వాసితులు మరియు అధికారుల సంప్రదింపుల అనంతరం నిర్ణయం తీసుకోవడం జరిగినది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది దినములలోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., యూనిట్ -1 నాగర్ కర్నూల్,** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, యూనిట్ -1 నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 42, తేది. 11.11.2025 ద్వారా భూసేకరణ, నష్ట పరిహరము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్

సం/-
అదనపు కలెక్టరు నాగర్‌కర్నూల్

సం/-
జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR R.O.No.356/LA/ADVT/PUB/2026-27



# ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రమాదబీమా

లక్ష్యమన్నారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఉద్యోగుల సమస్యలు, వారి అవస రాలు తనకు బాగా తెలుసని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు ప్రమాదంలో చనిపోతే కోటిన్నర బీమా ఇస్తామని ప్రకటించిన సీఎం.. ఆదిశగా ముందడుగు వేశారు. బ్యాంకులను ఒప్పించి బీమా ఎంఓయూపై సంతకం చేశారు. ఈ బీమాతో 15 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తించనుంది. తొలుత సింగరేణి సంస్థలో ఈ బీమాను ప్రారంభించారు. ఇప్పటికే 45 మంది సింగరేణి కార్మికులు చనిపోతే కోటిన్నర బీమా చెల్లించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు కోటిన్నర బీమా అమలులో డిప్యూటీసీఎం భట్టి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు.. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఈ బీమా అమలుపై అనేక సందేహాలున్నా.. తర్వాత ఉద్యోగులకు సంక్షేమమే లక్ష్యంగా ఎంతో కసరత్తు చేశామన్నారు. బ్యాంకర్లను ఒప్పించి ఈ బీమాను కల్పించామన్నారు సీఎం. మరోవైపు విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.3కోట్ల బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొందరు పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్స్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, గతంలో 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. 'మూసీ నది పునరుజ్జీవనం చేద్దామంటే నా కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు చేపడితే తప్పా? మెట్రో విస్తరణ చేద్దామన్నా, ఆర్‌ఆర్‌ఆర్ తెస్తామన్నా వద్దే వద్దని అడ్డుపడుతున్నారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్‌ఎస్ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీలు కాదు.. పరిష్కారాలు ముఖ్యం

ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

బళ్లారి,జూన్25(జనంసాక్షి): కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలిసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

# పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంచింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచింది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేలు వసూలు చేస్తుండగా ఇక నుంచి రూ.3500 వసూలు చేయనున్నారు. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించారు. 18ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా.. దీనిని రూ.1750కి పెంచారు. సవరించిన ఫీజులు జులై 1 నుంచి అమలులోకి రానున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు.

## స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించండి

**హైదరాబాద్(జనంసాక్షి):** పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

# ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్ల బదిలీ

హైదరాబాద్,జూన్25(జనంసాక్షి): రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు. రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్-1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.

# వరుస భూకంపాలతో వణికిన వెనెజువెలా



కూలిపోయాయి. ఈ ప్రకృతి విపత్తు ధాటికి పలువురికి గాయాలు కాగా.. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్యూర్టోరికో, వర్జిన్ దీవులకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి.

**జపాన్‌లోనూ భూకంపం..**

వెనెజువెలాను వణికించిన భూకంపం.. తర్వాత జపాన్‌నూ తాకింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.9గా నమోదైంది. హ్వాన్షు ఐలాండ్‌లోని ఐవాటె ప్రిఫెక్చర్ సమీపంలో 50కి.మీ.లోతులో భూకంప కేంద్రం ఏర్పడింది. అక్కడి నుంచి వందల కిలోమీటర్ల వరకు ప్రకంపనల తీవ్రత కనిపించిందని జపాన్ వాతావరణ విభాగం వెల్లడించింది. ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉంది. షింకాసెన్ బుల్లెట్ ట్రైన్ సర్వీసులను మాత్రం ప్రస్తుతానికి నిలిపివేశారు. ఈ దేశంలో ఎలాంటి సునామీ హెచ్చరిక జారీ కాలేదు.

**జాతీయ సెలవుదినం కావడంతో..**

వెనెజువెలాలో వరుస భూకంపాలు సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఈ విపత్తు ధాటికి ఆ దేశం అతలాకుతలమైంది. ప్రాణనష్టం కూడా భారీగానే ఉంది. ముఖ్యంగా తీర నగరమైన 'లా గువైరా' అయితే ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా ధ్వంసమైన భవనాల వరుసలే కన్పిస్తున్నాయి. ఇక, ఈ నగరంలోని ప్రముఖ హోటల్ ఒకటి శిథిలాల దిబ్బలా మారింది. లా గువైరాలోని మకుటో ప్రాంతంలో ఉంటే 'హోటల్ ఎడ్వర్డ్' పర్యటకులకు చాలా ఫేమస్. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ 10 అంతస్తుల భవనం.. బీచ్‌వ్యూతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇక్కడ పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయి. తాజాగా సంభవించిన భూకంపం ధాటికి ఈ భవనం పేకమేడలా కూలిపోయింది. కేవలం హోటల్ బేస్‌మెంట్ మాత్రమే మిగిలి గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే, భూకంపం సమయంలో ఈ హోటల్‌లో ఎంతమంది ఉన్నారు.. వారి పరిస్థితి ఏంటన్నది తెలియరాలేదు. వెనెజువెలా బేస్‌బాస్ స్టార్ ఆటగాళ్లకు చెందిన కుటుంబసభ్యులు ఈ హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం.

**డిజాస్టర్ జోన్‌గా..**

కేవలం క్షణాల వ్యవధిలో సంభవించిన భారీ భూకంపాల ప్రభావంతో వెనెజువెలా రాజధాని కరాకస్‌తో పాటు పలు నగరాలు చిన్నాభిన్నమయ్యాయి. ఇందులో అత్యధికంగా ప్రభావితమైంది 'లా గువైరా'నే అని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. దీన్ని 'డిజాస్టర్ జోన్'గా ప్రకటించారు. ఇక్కడ పరిస్థితి అత్యంత విషాదకరం అని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 30 సార్లు భూప్రకంపనలు సంభవించాయి. మరోవైపు, ఈ విపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 164కు పెరిగింది. 971 మంది గాయపడినట్లు రోడ్రిగ్జ్ వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, విపత్తు వేళ వెనెజువెలాకు సాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. జర్మనీ సైనిక రవాణా విమానాలను పంపిస్తామని చెప్పింది. ఎమర్జెన్సీ సాయం చేస్తామని స్పెయిన్ తెలిపింది. వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రతకు దేశ రాజధానిలో భారీనష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. "ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య వేలల్లో ఉండొచ్చు" అని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది.

# వెనెజువెలాకు ఆపన్న హస్తం

న్యూఢిల్లీ(జనంసాక్షి): వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

# 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి

**కాంగ్రెస్ నేతలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు**

హైదరాబాద్,జూన్25(జనంసాక్షి): సర్‌పై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సర్ క్రియను కాంగ్రెస్ క్యాడర్ అధిగమించాలని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలు అంతా ఈప్రక్రియను పరిశీలించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. నెల రోజుల పాటు బీఎల్‌వోలు బూత్‌ను విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ప్రతి పది బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సూపర్‌వైజర్‌ను పెడుతున్నామన్నారు. బీఎల్‌వోలతో నాయకులు నిరంతరం టచ్‌లో ఉండి.. సర్ జరిగే విధానాన్ని పరిశీలించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఏలను నియమించామని తెలిపారు. ఎస్.ఐ.ఆర్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బిహార్‌లో 76 లక్షల ఓట్లు, పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని.. ఆ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు.

# వృద్ధురాలు మెడలో బంగారు గొలుసు చోరీ



**గూడూరు, జూన్25 (జనంసాక్షి):** దాహమేస్తుందని నీళ్లు అడిగిన గుర్తు తెలియని దుండగులు వృద్ధురాలు మేడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్లగా ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దోసపాటి యాదమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు ఉన్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ వృద్ధురాలిని మంచినీళ్లు అడగడంతో, నీళ్ల కోసం ఇంట్లోకి వెళ్లగా, ఆమె వెంటనే ఇంట్లోకి వెళ్లిన దుండగులు మేడలోని బంగారు గొలుసును లక్కెళ్లారు. వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపే దుండగులు పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు.

## విపిన్ కుమార్ శర్మను కలిసిన టాప్రా ప్రతినిధులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ జోన్ అదనపు కేంద్ర పిఎఫ్ కమిషనర్ విపిన్ కుమార్ శర్మని టాప్రా అధ్యక్షులు పి. నారాయణరెడ్డి, ఇపిఎస్ కన్వీనర్ యన్ బ్రహ్మాచారి, ఫైనాన్స్ సీక్రెరీ గడ్డం అశోక్ కలిసారు. పంజాబ్/హర్యానా హైకోర్టు తీర్పు ను అమలు చేయాలని విన్నవించారు. హయ్యర్ పెన్షన్ అర్హులైనవారికి అప్లై చేయుటకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు లో రిటైర్డ్ వారు ఆయా ట్రస్ట్ లు హయ్యర్ పెన్షన్ కు అర్హులని పంపించినా అమలు చేయడం లేదని తదితర అంశాలపై మాట్లాడం జరిగింది. వారు కూడా స్పందించి సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు.

## సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలిక అదృష్టం

**రెబ్బెన, జూన్25(జనంసాక్షి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. కళాశాలకు వచ్చిన విద్యార్థిని తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో హాస్టల్ ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించారు. కళాశాల ప్రిన్సిపాల్ సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ సంజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థిని అదృశ్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. విద్యార్థికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ఇసుక లారీలతో నరకం



**కాళేశ్వరం , జూన్ 25 (జనంసాక్షి).** : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బీరసాగర్ వద్ద గత కొన్ని రోజుల క్రితం ఇసుక క్వారీ ప్రారంభం అయింది. దీంతో క్వారీ కి వెళ్లే లారీలు కాళేశ్వరం మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. కాళేశ్వరం బస్టాండ్ వద్ద నుంచి అంతరాష్ట్ర వంతెన మలుపు వరకు ఇసుక లారీలు బారులు తీరి ఉండడంతో వాహనాల రద్దీ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం గ్రామం లోని ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో లారీ ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో ఒక లారీ ఇంటిలోనికి దూసుకు వెళ్లిన సంఘటన ఈ ప్రాంతంలోనే జరిగింది. అటు అత్యవసర పనుల కోసం భూపాలపల్లి వెళ్లాలన్న , ఇటు మంచిర్యాల వెళ్లాలన్న ఇసుక లారీ ల వల్ల తీవ్ర అవస్థలు పడుతున్నామని కనుక క్వారీ కి వెళ్లడానికి వేరే రహదారి ఏర్పాటు చేయాలని లేదా జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేసి ఆ రహదారి గుండా లారీలను అనుమతించాలని ప్రజలు కోరుతున్నారు.

## బాలుడిపై బాలుడు లైంగిక దాడి

**వరంగల్ ఈస్ట్, జూన్ 25 (జనం సాక్షి)** : వరంగల్ నగరంలోని రామన్నపేట ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు బాలుడిపై లైంగిక దాడికి సంబంధించిన కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదుదారు తన ఇద్దరు కుమారులతో గత ఆరు సంవత్సరాలుగా తన తల్లి ఇంటి వద్ద నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపింది. తేది 18-06-2026 న ఆమె విధులకు వెళ్లగా, ఆమె ఇద్దరు కుమారులు పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న ఆమె 8 సంవత్సరాల వయస్సు గల పెద్ద కుమారుడిని పొరుగింటికి చెందిన 16 సంవత్సరాల బాలుడు తన ఇంటికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలుడిని బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి, తలుపులు మూసివేసి అతనిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాలుడు ఎక్కువసేపు ఇంటికి రాకపోవడంతో బంధువైన ఓ మహిళ వెతికి వెళ్లి విషయం తెలుసుకొని ఫిర్యాదుదారికి సమాచారం అందించింది. వెంటనే అక్కడికి చేరుకున్న తల్లి, తన కుమారుడు దుస్తులు సరిచేసుకుంటుండగా, నిందితుడు కూడా తన దుస్తులు ధరించుకుంటున్నట్లు గమనించినట్లు ఫిర్యాదులో తెలిపింది. అనంతరం బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించిన కారణంగా ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగినట్లు పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలలపై లైంగిక నేరాల విషయంలో ఎవరైనా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడం అత్యంత ముఖ్యమని పోలీసులు సూచించారు.

## జూలైలో అమరావతి ఆస్పత్రి పనులు

**ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడి**

**అమరావతి, జూన్25 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో బసవతారకం ఆస్పత్రి ఇంకా విస్తరణ జరుగుతుందని ఆ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. అమరావతిలో కూడా బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాలయ్య నటిస్తున్న 112వ సినిమా అమరావతిలో గురువారం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ మూవీ ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ ముఖ్య అతిథు లుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. జులైలో ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయని వివరించారు. 2028లో మొదటి దశ పనులు పూర్తి అవుతాయని చెప్పుకొచ్చారు. బసవతారకం ఆస్పత్రి నిర్మాణం కోసం వర్కర్లు పగలు, రాత్రుళ్లు కూడా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

# విద్యార్థులకు మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

- గోదావరి వరదల నివారణకు శాశ్వత రక్షణ చర్యలు
- ఆధునిక సాంకేతికతతో జియో ట్యూబ్స్ ద్వారా కరకట్టకు పటిష్ట భద్రత
- ప్రజలు, రైతులకు వరదల నుంచి దీర్ఘకాలిక రక్షణ కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతి, భోజనం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రతి ఏటా సంభవించే వరదల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాశ్వతంగా నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్ ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్‌తో కలిసి సందర్శించి, రామన్నగూడెం వద్ద గోదావరి నది కరకట్ట భద్రత కోసం నూతన సాంకేతికతతో ఏర్పాటు చేస్తున్న జియో ట్యూబ్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో హాస్టల్‌కు నూతనంగా చేరిన విద్యార్థినుల పరిస్థితులను పరిశీలించి, వసతి గృహంలోని మరుగుదొడ్లు, వంటశాల, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గోదావరి నది ప్రవాహ పరిస్థితులు, కరకట్ట భద్రత, వరదల సమయంలో నది కరకట్ట దెబ్బతినకుండా చేపడుతున్న రక్షణ చర్యలను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి, మ్యాప్ ఆధారంగా గోదావరి ప్రవాహ తీరు, కరకట్ట పరిస్థితులు, జియో ట్యూబ్స్ ఏర్పాటు విధానం, చేపడుతున్న రక్షణ చర్యలపై పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన ప్రతి సంవత్సరం గోదావరి వరదల ప్రభావంతో ఏటూరునాగారం, రామన్నగూడెం, మంగపేట, అకినేపల్లి మల్లారం, ఓడగూడెం తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత 10 నుండి 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గోదావరి రక్షణ పనులను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలతో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. మంగపేట, రామన్నగూడెం ప్రాంతాల్లో వరద ఉధృతి గ్రామాలపై ప్రభావం చూపకుండా దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో జియో ట్యూబ్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిమిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న తరుణంలో తొలిసారిగా ములుగు నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించే పరిస్థితి రాకుండా దీర్ఘకాలిక, శాశ్వత రక్షణ చర్యలు చేపడుతున్నామని, కరకట్టల వద్ద ఎక్కడైనా బలహీన ప్రాంతాలు గుర్తించిన వెంటనే తాత్కాలిక మరమ్మత్తులతో పాటు శాశ్వత నిర్మాణ పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగపేట ప్రాంతంలో కరకట్ట నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, రామన్నగూడెం వద్ద కూడా అదే తరహాలో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వరద పరిస్థితులపై పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు నాణ్యంగా ఉండేలా చూడాలని, ప్రభుత్వ వసతి గృహాల్లో పరిశుభ్రత, భోజన నాణ్యత, మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పిరంగి, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఐబీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కమిటీల చైర్మన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అహ్మద్ ఖాన్‌కు రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రిక అందజేత

- బహుజన వర్గాల రాజకీయ సాధికారత కోసం నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలి : అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు సంబంధించి పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా కరీంనగర్‌లోని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షోహెబ్ అహ్మద్ ఖాన్ గారిని, కమిటీ సభ్యులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యాధికార సమరభేరి సభ లక్ష్యాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేస్తున్న ఉద్యమం గురించి వివరించారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జులై 05న భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ బహుజన వర్గాల ఆశయాలను ప్రతిబింబించే చారిత్రాత్మక సభగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షద్ బిన్ అలీ, మహిళా ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, నాయకులు మహబూబ్ అలీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## సంపులో పడి రెండేళ్ల చిన్నారి మృతి

**చిట్యాల, జూన్ 25(జనం సాక్షి):** సంపులో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంచు మౌనిక, బీరన్న దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కలదు. కుమార్తె అన్వి (2) ప్రమాదవశాత్తు గురువారం నీటి సంపులో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, చిన్నారి కంచు అన్వి పిల్లలతో ఆడుకుంటూ బయటకు వెళ్ళింది. ఈ క్రమంలో ఇంటి ముందు ఉన్న నీటి సంపు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి లోపల పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 25 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. హనుమకొండ ఆదాలత్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫ్లాష్‌మాబ్‌లు, అవగాహన నాటికలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సామాజిక అభివృద్ధిపై చూపే ప్రతికూల ప్రభావాలను కళారూపాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం సమాజానికి పెను సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ ఏసిపి నరసింహ రావు, డిప్యూటీ సివిల్ సర్జన్ ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రవీందర్, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ అవంతి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్ చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, మహిళా శక్తి కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కళ్యాణి, సఖి అడ్మిన్ హైమావతి డెమో అశోక్ రెడ్డి హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ రాము, ఎఫ్ ఆర్ ఓ రవి కృష్ణ, కెయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కే అనితా రెడ్డి, విద్యా శాఖ సీఎంవో సుమ, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ , ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, పాఠశాల విద్యార్థులు, విద్యా, వైద్యారోగ్య శాఖ, పోలీస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డిఎంహెచ్వో డాక్టర్ రామ్ కుమార్



**హనుమకొండ ప్రతినిధి జూన్ 25 (జనం సాక్షి) :** సమయపాలన పాటించకపోవడం విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎస్.డి.రామ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం లో సేవలందిస్తున్న సిబ్బంది అలాగే క్షేత్రస్థాయిలో ఎవరెవరు ,ఎక్కడ సేవలందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ముందస్తు సెలవు ,అనుమతి లేకుండా 6 రోజులు గైర్హాజరైన ఉద్యోగికి అలాగే ఈ రోజు విధులకు హాజరు కాని ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు . ఈ సందర్భంగా సేవల నిమిత్తం వచ్చినటువంటి వారిని ఏ సమస్యల నిమిత్తం వచ్చారు ,అలాగే ఇక్కడ చికిత్స ఎలా అందుతుంది అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్యపరమైన సేవలను అందించడం అందరి బాధ్యత అని ఎవరికి కేటాయించిన విధులను వారు తప్పనిసరిగా నిర్వర్తించాలన్నారు. అలాగే ఆదివారం నిర్వహించే పల్స్ పోలియోకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను ఆయన అడిగి తెలుసుకున్నారుపెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రనిర్మాణ నిమిత్తం కేటాయించినటువంటి స్థలాన్ని ఆయన పరిశీలించారుఅనంతరం రంగంపేటను సందర్శించి అక్కడ ఏఎన్ఎం నిర్వహిస్తున్న విధులను ఆయన పరిశీలించారు. రంగంపేట -3 అంగన్వాడి సెంటర్ ని సందర్శించి అక్కడ నమోదైన గర్భిణీ స్త్రీలను అలాగే ఏఎన్ఎం వద్ద నమోదైన గర్భిణీ స్త్రీల వివరాలను పరిశీలించారు .అలాగే గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం సందర్శించిన డి యం హెచ్ ఓ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి హనుమకొండలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని డిఎంహెచ్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్నటువంటి వివిధ విభాగాలను ,అలాగే అక్కడ అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలను, నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు అందిస్తున్నటువంటి సేవలను ఆయన పరిశీలించారు.

## పత్రిక ప్రకటన

ప్రజలకు తెలియజేయునది ఏమనగా, శ్రీ గడ్డం శంకరయ్య, తండ్రి పేరు రాజయ్య, వయస్సు 47 సంవత్సరాలు, వృత్తి **TGNPDCL** ఉద్యోగి, నివాసం హెచ్.నెం. 4-37/1, గుర్రంపల్లి, మారేడుగొండ గ్రామం, పెద్దపల్లి మండలం మరియు జిల్లా, తన ఆస్తి అయిన సర్వే నెం. 526లో గల 248.12 చదరపు గజాల ఓపెన్ ప్లాట్, FCI గోదాం ప్రాంతం, హెచ్.నెం. 1-1-81 సమీపంలో, పెద్దపల్లి పట్టణం ఉన్న స్థలాన్ని తేదీ 04/06/2026 రోజున అమ్మినారు రిజిస్ట్రేషన్ కూడా అయినది. కొనుగోలుచేసినవారు శ్రీ బొజ్జ ఆకాశ కుమార్, తండ్రి కాశీనాథం. వయస్సు 36 సంవత్సరాలు, వృత్తి **TGSRTC** ఉద్యోగి, నివాసం హెచ్. నెం 5-116/1 **GD** నగర్ పాలకుర్తి మండల్ పెద్దపల్లి జిల్లా గారు. గృహ రుణం కోసం తాకట్టు పెట్టుచున్నాడు. అదేవిధంగా, రిజిస్టర్ గిఫ్ట్ డీడ్ నెం. 2635/2016 తేదీ 25-05-2016 మరియు రిజిస్టర్ రిలీజ్ ఆఫ్ రైట్స్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4511/2016 తేదీ 03-09-2016, ఎస్.ఆర్.ఓ. పెద్దపల్లిలో నమోదు చేయబడిన అసలు లింక్ పత్రాలు, 01-06-2026 తేదీన గడ్డం శంకరయ్య పెద్దపల్లి బస్ స్టాండ్ నుండి పెద్దపల్లి కమాన్ వరకు బైక్పై ప్రయాణిస్తూ, పై పత్రాల జిరాక్స్ తీయించుకొనుటకు వెళ్తున్న సమయంలో పోయినవి. పై అసలు లింక్ పత్రాల కోసం ఎంతగానో వెతికినప్పటికీ అవి లభించలేదు. కాబట్టి, పై ఆస్తిపై ఎవరికైనా హక్కులు, క్లెయిమ్లు లేదా అభ్యంతరాలు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు నాకు తెలియజేయవలెను. ఎందుకంటే బొజ్జ ఆకాశ కుమార్ పై ఆస్తిని నా క్లయింట్ బ్యాంకు వద్ద తాకట్టు పెట్టుచున్నాడు. నిర్దిష్ట గడువులో ఎటువంటి అభ్యంతరాలు లేదా క్లెయిమ్లు అందనిచో, పై ఆస్తిపై ఎటువంటి అభ్యంతరాలు లేవని భావించి నా క్లయింట్ తదుపరి చర్యలు కొనసాగించును. అనంతరం అందే ఎటువంటి అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోబడవు.

**ఎం. సునీల్ కుమార్, అడ్వకేట్**
**హెచ్.నెం. 3-7-41, శ్రీరామ్ నగర్ - 505172**
**సెల్ : 9866112209**

తెలంగాణ రైతు కుతికపై
# 'నకిలీ' కత్తి..!

సంపాదకీయం

*వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయితే, రైతు దానికి ప్రాణాధారం. అలాంటి రైతు భవిష్యత్తును నాశనం చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన సమస్యల్లో నకిలీ విత్తనాల వ్యాపారం ఒకటి. ముఖ్యంగా దేశంలో ప్రధాన పత్తి సాగు రాష్ట్రంగా పేరొందిన తెలంగాణలో నకిలీ విత్తనాల మాఫియా పంజా విసురుతుండటం ఆందోళనకర పరిణామం. వానాకాలం ప్రారంభమై రైతులు ఆశలతో పొలాల్లోకి అడుగుపెడుతున్న వేళ, నకిలీ విత్తనాల బెడద మరోసారి వెలుగుచూడడం రైతాంగానికి పెద్ద ముప్పుగా మారింది.*

ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు పత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయల సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఈ భారీ డిమాండ్‌ను అవకాశంగా మార్చుకున్న అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నారు. ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకెట్లు తయారు చేయడం, అనుమతి లేని గోదాముల్లో నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా తరలించడం వంటి చర్యలతో రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్దఎత్తున విత్తనాలను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, ఈ అక్రమ వ్యాపారం పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు. తెలంగాణలో నమోదైన అనేక కేసులు పరిశీలిస్తే, నకిలీ విత్తనాల సరఫరాలో అంతర్రాష్ట్ర ముఠాల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అక్రమంగా విత్తనాలు తరలిస్తున్నట్లు దర్యాప్తుల్లో తేలింది. 2014 నుంచి 2022 మధ్య తెలంగాణలో 991 నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయి. నిషేధిత హెచ్‌టిబీటీ పత్తి విత్తనాల రవాణాలో మహారాష్ట్ర మార్గం కీలకంగా మారగా, కొన్ని కేసుల్లో ప్రముఖ కంపెనీల బ్రాండ్లను పోలిన నకిలీ సంచులతో రైతులను మోసం చేసిన ముఠాలు బయటపడ్డాయి. ఇది కేవలం చట్టవ్యతిరేక వ్యాపారం మాత్రమే కాదు, రైతు జీవితాలతో ఆడుకునే వ్యవస్థీకృత నేరం.

నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, విక్రయం చట్టరీత్యా తీవ్రమైన నేరమే. విత్తనాల చట్టం-1966, విత్తనాల నియంత్రణ ఉత్తర్వులు-1983, భారతీయ న్యాయ సంహితలోని పలు నిబంధనల కింద కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో గత కొన్నేళ్లలో వందలాది కేసులు నమోదు కాగా, వేలాది మందిపై చర్యలు తీసుకున్నారు. కొందరిపై పీడీ యాక్ట్ కూడా ప్రయోగించారు. అయినప్పటికీ ఈ వ్యాపారం పూర్తిగా ఆగకపోవడం ఆందోళన కలిగించే అంశం. కేసుల విచారణలో జాప్యం, శిక్షల అమలులో ఆలస్యం, అక్రమ వ్యాపారులు పేర్లు మార్చుకుని మళ్లీ మార్కెట్‌లోకి రావడం వంటి అంశాలు ఈ సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. కేవలం దాడులు, కేసులు నమోదు చేయడం సరిపోదు. విత్తనాల ఉత్పత్తి నుంచి విక్రయం వరకు సమగ్ర పర్యవేక్షణ వ్యవస్థ అవసరం. జిల్లాలవారీగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయడం, సరిహద్దు జిల్లాల్లో తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయడం, వేగవంతమైన న్యాయ ప్రక్రియ ద్వారా నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడడం అత్యవసరం. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సహకార సంఘాలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన విక్రయ కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. దేశానికి అన్నం పెట్టే రైతన్నను మోసం చేసే నకిలీ విత్తనాల మాఫియాపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. రైతు రక్షణే వ్యవసాయ రక్షణ. నకిలీ విత్తనాల నిర్మూలనలో ప్రభుత్వం, అధికారులు, రైతులు, సమాజం సమిష్టిగా ముందుకు వచ్చినప్పుడే ఈ సామాజిక దురాచారానికి శాశ్వతంగా చెక్ పెట్టగలం. ఇది ప్రభుత్వాల చిత్తశుద్ధికి కూడా ఓ పెద్ద పరీక్ష..!!

# గోల్వాల్కర్ నుండి గుజరాత్ వరకు...
## హిందూ రాష్ట్రం పేరుతో దేశాన్ని ఎటు తీసుకెళ్తున్నారు?

భారతదేశం గురించి రెండు కలలు ఉన్నాయి. ఒకటి అంబేద్కర్ కల. మరొకటి గోల్వాల్కర్ కల. ఒకటి రాజ్యాంగ భారతం. మరొకటి హిందూ రాష్ట్రం. ఒకటి సమానత్వం మీద నిలబడింది. మరొకటి సాంస్కృతిక ఆధిపత్యం మీద నిలబడింది. ఒకటి కుల నిర్మూలన గురించి మాట్లాడింది. మరొకటి "హిందూ ఐక్యత" పేరుతో కుల ప్రశ్నను పక్కకు నెట్టింది. నేటి భారత రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే ఈ రెండు దారుల మధ్య జరుగుతున్న సంఘర్షణను అర్థం చేసుకోవాలి. ఆర్‌ఎస్‌ఎస్ రెండో సర్‌సంఘచాలక్ మాధవ్ సదాశివ గోల్వాల్కర్ కేవలం ఒక సంస్థ నాయకుడు కాదు. హిందూత్వ రాజకీయాలకు సిద్ధాంత పునాది వేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకడు. ఆయన రాసిన "వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" మరియు "బంచ్ ఆఫ్ థాట్స్" పుస్తకాలు నేటికీ హిందూత్వ రాజకీయాల మూల గ్రంథాలుగా పరిగణించబడుతున్నాయి. గోల్వాల్కర్ దృష్టిలో భారతదేశం అంటే రాజ్యాంగం నిర్వచించిన పౌర సమాజం కాదు. భారతదేశం అంటే హిందూ సంస్కృతి. హిందూ నాగరికత. హిందూ జీవన విధానం. అందుకే ఆయన భారతదేశాన్ని ఒక బహుళత్వ దేశంగా చూడలేదు. ఒకే సాంస్కృతిక గుర్తింపు కింద అందరినీ తీసుకురావాలను కున్నాడు.

అందులోనే సమస్య మొదలవుతుంది. ఎందుకంటే భారతదేశం ఒకే రంగు పూలతో చేసిన తోట కాదు. ఇది భాషల సముద్రం. ఇది మతాల సంగమం. ఇది సంస్కృతుల కూడలి. ఇది దళితుడి చెమటతో, ఆదివాసి అడవితో, ముస్లిం కళాకారుడి చేతివృత్తితో, బౌద్ధుని తత్వంతో, సిక్కు త్యాగంతో, క్రైస్తవ సేవతో నిర్మించబడిన దేశం. అలాంటి దేశాన్ని ఒకే గుర్తింపులో బంధించాలనే ప్రయత్నమే గోల్వాల్కర్ రాజకీయాల గుండెకాయ.

ఆయన రచనల్లో అత్యంత వివాదాస్పద అంశం జర్మనీలో నాజీ పాలన గురించి చేసిన వ్యాఖ్యలు. యూదులపై జరిగిన దారుణాలను "జాతి గర్వం"గా అభివర్ణించడం కేవలం ఒక చారిత్రక పొరపాటు కాదు. అది ఒక ప్రమాదకరమైన రాజకీయ సంకేతం. వైవిధ్యాన్ని సమస్యగా చూడడం. భిన్నత్వాన్ని అనుమానంతో చూడడం. మైనారిటీలను "వేరే వారు"గా గుర్తించడం. ఇవన్నీ ఫాసిస్టు రాజకీయాల లక్షణాలు.

కామ్రేడ్ వినోద్ మిశ్రా ఈ అంశాన్ని చాలా స్పష్టంగా విశ్లేషించారు. ఆయన చెప్పిన మాటల్లో, హిందూత్వాన్ని కేవలం మత విశ్వాసంగా చూడకూడదు. అది ఒక రాజకీయ ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు లక్ష్యం




కేవలం హిందువులను సంఘటితం చేయడం కాదు. భారతదేశపు ప్రజాస్వామిక, లౌకిక, బహుళత్వ స్వరూపాన్ని క్రమంగా బలహీన పరచడం. ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించడం. మతాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం.


వినోద్ మిశ్రా ఒకసారి అన్నాడు.. "మతతత్వం ప్రజల నిజమైన సమస్యలపై పొగమంచు కప్పుతుంది." నిజంగానే అదే జరుగుతోంది. దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. రైతు అప్పుల్లో కూరుకుపోతున్నాడు. కార్మిక హక్కులు క్షీణిస్తున్నాయి. ప్రభుత్వ విద్య కుంగిపోతోంది. కానీ చర్చ మాత్రం మసీదు గురించే. ఆహారం గురించే. దుస్తులు గురించే. పేర్లు గురించే. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది రాజకీయ వ్యూహం. గోల్వాల్కర్ భావజాలం కుల సమస్యను కూడా ఇదే రీతిలో చూసింది. ఆయన రచనల్లో కుల అణచివేతను సమాజపు ప్రధాన వైరుధ్యంగా గుర్తించిన సందర్భాలు కనిపించవు. దళితులపై దాడుల వార్తలను కూడా ఆయన అనుమానంతో చూశాడు.

ఇదే అంశంపై వినోద్ మిశ్రా చాలా పదునైన విమర్శ చేశాడు. ఆయన దృష్టిలో కులం కేవలం సామాజిక అలవాటు కాదు. అది అధికార సంబంధం. అది దోపిడీ వ్యవస్థ. అది మనిషిని మనిషిగా చూడకుండా చేసే నిర్మాణం. అందుకే అంబేద్కర్ "కుల నిర్మూలన" అన్నాడు. గోల్వాల్కర్ "హిందూ ఐక్యత" అన్నాడు. ఈ రెండు మధ్య తేడా చాలా పెద్దది. ఒకటి సమస్యను ఎదుర్కొంటుంది. మరొకటి సమస్యను కప్పిపుచ్చుతుంది. మహిళల విషయంలో కూడా గోల్వాల్కర్ ఆలోచనలు సంప్రదాయవాద పరిమితులను దాటలేదు. మహిళల సమాన హక్కులు, స్వేచ్ఛ, రాజకీయ భాగస్వామ్యాన్ని ఆయన అనుమానంతో చూశాడు.

కానీ చరిత్ర మరో విషయం చెబుతోంది. సావిత్రిబాయి పూలే లేకపోతే మహిళా విద్య ఉండేది కాదు. ఫాతిమా షేక్ లేకపోతే సామాజిక సంస్కరణలు ముందుకు సాగేవి కావు. అంటే సమాజాన్ని ముందుకు నడిపింది సంప్రదాయం కాదు. ప్రశ్నించే ధైర్యం. అణచివేతకు ఎదురు నిలిచిన పోరాటం.

అదే విషయాన్ని వినోద్ మిశ్రా మరింత విస్తృతంగా వివరించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం హిందూత్వ రాజకీయాల ప్రమాదం కేవలం ముస్లింలకు మాత్రమే కాదు. దళితులకు ప్రమాదం. ఆదివాసీలకు ప్రమాదం. మహిళలకు ప్రమాదం. కార్మికులకు ప్రమాదం. రైతులకు ప్రమాదం. చివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఎందుకంటే ఈ రాజకీయాలు సమాజాన్ని ప్రశ్నించే ప్రజలుగా కాదు, భావోద్వేగాలతో కదిలే గుంపులుగా మార్చాలనుకుంటాయి. అందుకే నేడు భారతదేశం ముందు నిలిచిన ప్రశ్న కేవలం ఎన్నికల ప్రశ్న కాదు. ఇది దేశం ఏ దిశగా వెళ్లాలి అన్న ప్రశ్న. అంబేద్కర్ దిశగా? లేక గోల్వాల్కర్ దిశగా? రాజ్యాంగ దిశగా? లేక హిందూ రాష్ట్రం దిశగా? సమానత్వ దిశగా? లేక ఆధిపత్య దిశగా?

కామ్రేడ్ వినోద్ మిశ్రా జీవితాంతం ఇచ్చిన సందేశం ఇదే. హిందూత్వాన్ని ఓడించడం అంటే కేవలం ఒక పార్టీని ఓడించడం కాదు. అసమానతను ఓడించడం. కుల వివక్షను ఓడించడం. మత విద్వేషాన్ని ఓడించడం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం. భారతదేశాన్ని మరింత లౌకికంగా, మరింత సమానత్వంతో, మరింత ప్రజాస్వామికంగా నిర్మించడం. ఎందుకంటే.. దేశాన్ని నిజంగా కలిపేది మతం కాదు. అధికార భాష కాదు. ఒకే సంస్కృతి కాదు. దేశాన్ని కలిపేది న్యాయం. సమానత్వం. సౌభ్రాతృత్వం. అదే రాజ్యాంగం. అదే అంబేద్కర్. అదే భారతదేశ భవిష్యత్తు. అదే లిబరేషన్ రాజకీయాల సారాంశం.



**- మామిండ్ల రమేష్ రాజా,**
రాష్ట్ర కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, తెలంగాణ
సెల్ : 78932 30218




## జీవామృతం

వాన మొరలు
పూజలు భజనలు
జనం భరోసా
కప్పల పెళ్లి
వానా వానా రావయ్య
పల్లె నమ్మకం
ఎండిన బావి
నీటి గుంట చెరువు
బిందెల గోల
పశుపక్షులు
దాహపు చావుకేక
నీటి ఎద్దడి
నీటిమార్గాలు
జీవామృత దారులు
కరువు నహీ
ప్రగతి సహీ

**రేడియమ్**
9291527757

వ్యవసాయం రైతుకు ఉద్యోగం కాదు
# ప్రాణాలతో చేసే పోరాటం!




వ్యవసాయం మానవ నాగరికతకు మూలాధారం. ప్రపంచంలోని ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థకు ఆహార భద్రత అందించే ప్రధాన రంగం ఇదే. భారతదేశంలో సుమారు 42% మంది ప్రజలు నేరుగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తు న్నారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 16-18% మధ్య ఉన్నప్పటికీ, ఉపాధి కల్పనలో ఈ రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. అయితే దేశానికి అన్నం పెట్టే రైతు జీవితం నేడు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. ఒకప్పుడు గౌరవప్రదమైన వృత్తిగా భావించిన వ్యవసాయం ఇప్పుడు అనిశ్చితి, అప్పులు, ప్రకృతి వైపరీత్యాల మధ్య ప్రాణాలను పణంగా పెట్టే పోరాటంగా మారింది.

"వ్యవసాయం రైతుకు ఉద్యోగం కాదు – అది ప్రాణానికే ముప్పు" అనే వాక్యం అతిశయోక్తి కాదు. భారతదేశంలోని వేలాది రైతుల జీవితాలను పరిశీలిస్తే ఈ వాస్తవం స్పష్టమవుతుంది. ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, సరైన గిట్టుబాటు ధరల లేమి, అప్పుల భారాలు, వాతావరణ మార్పులు, మార్కెట్ అస్థిరత, ప్రభుత్వ విధానాల అమలులో లోపాలు వంటి అనేక కారణాలు రైతు జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. పంటను పండించే ప్రతి దశలో రైతు ప్రాణాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వాతంత్ర్యం అనంతరం హరిత విప్లవం దేశాన్ని ఆహార కొరత నుండి బయటపడేసింది. గోధుమ, వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. కానీ ఉత్పత్తి పెరిగినంత మాత్రాన రైతు ఆదాయం పెరగలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల కంటే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్, కార్మిక వ్యయం అనేక రెట్లు పెరిగాయి. ఫలితంగా రైతు లాభం కంటే నష్టాన్నే ఎక్కువగా ఎదుర్కొంటున్నాడు.

### చిన్న రైతుల సంక్షోభం

భారతదేశంలో 85% కంటే ఎక్కువ మంది రైతులు చిన్న, సన్నకారు రైతులే. వీరి భూకమతాలు 2 హెక్టార్ల కంటే తక్కువగా ఉంటాయి. చిన్న భూమిలో సాగు చేయడం వల్ల యాంత్రీకరణ పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండగా ఆదాయం తక్కువగా ఉంటుంది. భూమి చిన్నదైపోవడం రైతు కుటుంబాల భవిష్యత్తును మరింత సంక్లిష్టంగా మార్చుతోంది.

పెట్టుబడి వ్యయం గత 20 సంవత్సరాలలో అనేక రెట్లు పెరిగింది. ఒక ఎకరం వరి సాగుకు వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. విత్తనం నుండి కోత వరకు ప్రతి దశలో రైతు అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. పంట బాగా వచ్చినా ధర ఉండదు. ధర ఉన్నప్పుడు దిగుబడి తగ్గుతుంది. ఈ విరుద్ధ పరిస్థితి రైతును ఆర్థికంగా పూర్తిగా బలహీనుడిని చేస్తోంది.

### ఆత్మహత్యలు - జాతీయ సమస్య

భారతదేశంలో రైతుల ఆత్మహత్యలు అత్యంత ఆందోళనకరమైన అంశంగా మారాయి. గత కొన్ని దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు అప్పుల భారం, పంట నష్టం, ఆర్థిక నిరాశ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు జాతీయ స్థాయి గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రతి రైతు ఆత్మహత్య వెనుక ఒక కుటుంబం, ఒక గ్రామం, ఒక సమాజం దుఃఖంలో మునిగిపోతుంది. ఇది కేవలం వ్యక్తిగత విషాదం కాదు; దేశ వ్యవసాయ వ్యవస్థ వైఫల్యానికి ప్రతీక.

### వాతావరణ మార్పులు, నీటి కొరత

వాతావరణ మార్పులు రైతు జీవితాన్ని మరింత ప్రమాదకరంగా మార్చాయి. అతివృష్టి, అనావృష్టి, ఆకస్మిక తుఫాన్లు, వడగళ్ల వానలు సాధారణమయ్యాయి. భూగర్భ జలాల కొరత కూడా ప్రధాన సమస్య. బోర్లు వందల అడుగుల లోతుకు వెళ్లినా నీరు అందడం లేదు. రైతు లక్షల రూపాయలు అప్పు చేస్తాడు. నీరు రాకపోతే అప్పు మాత్రమే మిగులుతుంది.

### మధ్యవర్తులు, బీమా లోపాలు

వ్యవసాయ మార్కెట్లలో మధ్యవర్తుల ఆధిపత్యం రైతు ఆదాయాన్ని తగ్గిస్తోంది. నిల్వ సదుపాయాల లేమి కారణంగా తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. వ్యవసాయ బీమా పథకాలు ఉన్నప్పటికీ అమలులో లోపాలు, ఆలస్యం రైతులను నిరాశకు గురి చేస్తున్నాయి. వ్యవసాయ కూలీల కొరత, రసాయన ఎరువుల అధిక వినియోగం నేల సారాన్ని తగ్గిస్తోంది.

### యువత వలసలు, భవిష్యత్ సవాళ్లు

గ్రామీణ యువతలో వ్యవసాయం పట్ల నిరాసక్తత పెరుగుతోంది. స్థిరమైన ఆదాయం లేకపోవడం, గౌరవం లేకపోవడం వల్ల పట్టణాలకు వలస వెళు న్నారు. భవిష్యత్తులో వ్యవసాయం కొనసాగించే వారి సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపైనా ప్రభావం చూపుతుంది.

### పరిష్కారాలు అవసరం


వ్యవసాయ సంక్షోభానికి సమగ్ర సంస్కరణలు అవసరం. రైతుకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ, తక్కువ వడ్డీ రుణాలు, ఆధునిక నిల్వ సదుపాయాలు, సూక్ష్మ సాగునీటి పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ, వాల్యూ ఆధారిత ప్రాసెసింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, డిజిటల్ మార్కెట్ వ్యవస్థలు అమలు చేయాలి. చిన్న రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, శాస్త్రీయ శిక్షణ, వాతావరణ సమాచార వ్యవస్థలు అందించాలి. రైతు ఆరోగ్య రక్షణ, వృద్ధాప్య భద్రత, కుటుంబ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలి.

రైతు బలహీనపడితే దేశం బలహీనపడుతుంది. ఆహార భద్రత లేని దేశం ఎన్ని సాంకేతిక అభివృద్ధులు సాధించినా స్థిరంగా నిలబడదు. "వ్యవసాయం రైతుకు ఉద్యోగం కాదు – అది ప్రాణాలతో చేసే పోరాటం" అనే వాస్తవాన్ని "వ్యవసాయం రైతుకు గౌరవప్రదమైన జీవనాధారం"గా మార్చడం మనందరి బాధ్యత. ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, సమాజం, వినియోగదారులు అందరూ కలిసి రైతును ఆదుకోవాలి. రైతు నవ్వితే గ్రామం నవ్వుతుంది, గ్రామం నవ్వితే దేశం అభివృద్ధి చెందుతుంది. రైతు సురక్షితంగా ఉంటేనే భారతదేశ భవిష్యత్తు సుస్థిరంగా నిలుస్తుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యోద్యమాలు
# తెలంగాణ పరిశోధనల సమగ్ర సమీక్ష




తెలుగు సాహిత్య పరిశోధనలో భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం వంటి ప్రత్యేక ధోరణులతో పాటు ఆధునిక కవిత్వ పరిణామం, ఉద్యమాల ప్రభావం, మార్క్సిస్టు భావజాలం, తిరుగుబాటు కవిత్వం, ఉద్యమ గీతాలు, ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం వంటి అంశాలపై కూడా విశేష పరిశోధనలు జరిగాయి. ఈ అధ్యయనాలు ఆధునిక తెలుగు కవిత్వ వికాసాన్ని, దాని సామాజిక-రాజకీయ నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతున్నాయి. ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు, ప్రయోగములు – సి. నారాయణ రెడ్డి (1962), ఉస్మానియా విశ్వవిద్యాలయం,. ఆధునిక కవిత్వం లో సంప్రదాయం మరియు నవ్య ప్రయోగాల మధ్య సంబంధాన్ని విశ్లేషించిన ప్రముఖ అధ్యయనం., ఆధునికాంధ్ర కవిత్వంపై ఉద్యమాల ప్రభావం – ఎం.సుబ్బారెడ్డి (1971), ఉస్మానియా విశ్వవిద్యాలయం. వివిధ సామాజిక, రాజకీయ ఉద్యమాలు ఆధునిక కవిత్వంపై చూపిన ప్రభావాన్ని పరిశీలించిన పరిశోధ న., తెలుగులో ఉద్యమ గీతాలు – ఎస్. వి. సత్య నారాయణ (1989), ఉస్మానియా విశ్వవిద్యాలయం., ఆధునిక తెలుగు కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు (1967-1995) – తూర్పుమల్లారెడ్డి (1995), ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఆధునిక కవిత్వంలో ప్రతిఘటన, తిరుగుబాటు స్వరాల వికాసాన్ని విశ్లేషించిన అధ్యయనం.,ఆధునికాంధ్ర కవిత్వంపై మార్క్సిజం ప్రభావం – ఎం. పి. రవీంద్రరెడ్డి (1988), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం.,సామ్రాజ్యవాద-ప్రపంచీకరణ వ్యతిరేక కవి త్వం (ఎం.ఫిల్. పరిశోధన) – సి. హెచ్. కాశీం (2002), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం.ప్రపంచీకరణ, సామ్రాజ్య వాద విధానాలపై ప్రతిస్పందనగా వచ్చిన కవిత్వాన్ని అధ్యయనం చేసిన పరిశోధన. ఆధునిక కవిత్వ విమర్శ – సమాలోచన – ఎల్. రవికుమార్. ఈ పరిశోధనలను పరిశీలిస్తే ఆధునిక తెలుగు కవిత్వం, ఉద్యమాల ప్రభావం, ఉద్యమ గీతాలు, మార్క్సిస్టు భావజాలం, తిరుగుబాటు కవిత్వం, ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం, కవిత్వ విమర్శ వంటి అంశాలకు విశేష ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ఆధునిక కవిత్వం సామాజిక మార్పులకు ఎలా స్పందించిందనే విషయాన్ని ఈ పరిశోధనలు వివిధ కోణాల్లో విశ్లేషించాయి. ఉద్యమాలు, రాజకీయ భావ జాలాలు, సామాజిక చైతన్యం, ప్రపంచీకరణ ప్రభావాలు తెలుగు కవిత్వాన్ని ఎలా ప్రభావితం చేశాయో అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనాలు విలువైన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

### కవి/రచయిత భావజాలం, మానవతావాదం, విప్లవ చైతన్యం అంశాలపై పరిశోధనలు

"చెరబండ రాజు కవిత్వం – మావో ఆలోచనల ప్రభావం" – 1981, బెంగళూరు విశ్వవిద్యాలయం, ఎం.ఫిల్ పరిశోధన – సి.హెచ్. పెద్దిరెడ్డి చెరబండ రాజు (బద్దం భాస్కరరెడ్డి) యాదాద్రి-భువనగిరి జిల్లా అంకుశాపురం గ్రామానికి చెందిన విప్లవ కవి. దిగంబర కవుల ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. దిక్సూచి, ముట్టడి, గమ్యం తదితర కవితా సంపుటాలు రచించారు. ఆయన కవిత్వంలో మావోయిస్టు భావజాల ప్రభావాన్ని ఈ పరిశోధన విశ్లేషించింది."తెలుగు సాహిత్యంలో ఉపభ్రవ కవిత్వం – నగ్నముని 'కొయ్యగుర్రం' కావ్య పరిశీలన" – 1985, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎం.ఫిల్ పరిశోధన – ఎన్. సరస్వతి.నగ్నముని (మానేపల్లి హృషీకేశ్వర రావు) ఆధునిక తెలుగు కవిత్వంలో విభిన్న స్వరాన్ని వినిపించిన కవి. కొయ్యగుర్రం ఆయన ప్రసిద్ధ కావ్యం. సమకాలీన సామాజిక-రాజకీయ వాస్తవాలపై విమర్శనాత్మక దృష్టిని ఈ కావ్యం ప్రతిబింబిస్తుంది.."సమకాలీన కవిత్వంలో మానవతా వాదం – 'విశ్వంభర' ప్రత్యేక పరిశీలన" – 1987, ఉస్మానియా విశ్వవిద్యాలయం – ఆర్. వసునందన్. డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) కరీంనగర్ జిల్లా హనుమాజీపేటకు చెందిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత. విశ్వంభర కావ్యం ద్వారా విశ్వమానవతా భావనను ప్రతిపాదించారు. ఈ పరిశోధన మానవతావాద దృక్పథాన్ని విశ్లేషించింది."ఎన్. గోపి కవిత్వం – 'జలగీతం' మానవీయ మహాకావ్యం" –ఎం.ఫిల్ పరిశోధన, 2008, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం – బి. ముకుందరావు,ఆచార్య ఎన్. గోపి నల్గొండ జిల్లా భోంగిర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు. జలగీతం, కాలాన్ని నిద్రపోనివ్వను, నానీలు వంటి రచనలతో ప్రసిద్ధి పొందారు. జలగీతంలోని మానవీయ, పర్యావరణ చైతన్యాన్ని ఈ పరిశోధన పరిశీలించింది."గోపి కవిత్వంలో మానవత" – 2004, ఉస్మానియా విశ్వవిద్యాలయం – జి. రవికుమార్.ఎన్. గోపి కవిత్వంలో వ్యక్తమైన మానవతా విలువలు, సామాజిక స్పృహ, విశ్వమానవ దృక్పథాన్ని ఈ అధ్యయనం విశ్లేషించింది.,"చైతన్యవర్తన కవులలో వే. న. రెడ్డి" – కూర్మెళ్ల ఎల్లయ్య, వే. న. రెడ్డి (వేణ ముద్దుల నరసింహారెడ్డి) చైతన్యవర్తన కవితా ధోరణికి చెందిన కవిగా గుర్తింపు పొందారు. ఆయన కవిత్వంలోని సామాజిక చైతన్యం, అభ్యుదయ భావాలను ఈ పరిశోధన పరిశీలించింది."గద్దర్ గేయాలలో విప్లవ చైతన్యం" – 2024, తెలంగాణ విశ్వవిద్యాలయం – టి. అనుష, గద్దర్ (గుమ్మడి విట్టల్‌రావు) మెదక్ జిల్లా తూప్రాన్ ప్రాంతానికి చెందిన ప్రజాకవి, ప్రజాగాయకుడు. సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో, పొడుస్తున్న పొద్దుమీద వంటి గేయాల ద్వారా విప్లవ చైతన్యాన్ని ప్రజల్లో వ్యాప్తి చేశారు. ఈ పరిశోధన ఆయన గేయాలలోని విప్లవ భావజాలాన్ని విశ్లేషించింది.,."వరవరరావు కవిత్వం – విప్లవ దృక్పథం" – 2024, ఉస్మానియా విశ్వవిద్యాలయం – ఎస్. హరిత, పెండ్యాల వరవరరావు వరంగల్ జిల్లా చినపెండ్యాలకు చెందిన ప్రముఖ విప్లవ కవి, విమర్శకుడు. చలినెగళ్లు, జీవనాడి, ముక్తకంఠం, భవిష్యత్ చిత్రపటం వంటి రచనల ద్వారా విప్లవ సాహిత్యానికి ప్రత్యేక దిశను అందించారు. ఈ పరిశోధన ఆయన కవిత్వంలోని విప్లవ దృక్పథాన్ని పరిశీలించింది. ఈ పరిశోధనలు తెలుగు, తెలంగాణ కవిత్వంలో మావోయిస్టు భావజాలం, మానవతావాదం, అభ్యుదయ దృక్పథం, విప్లవ చైతన్యం వంటి ప్రధాన సాహిత్య ధోరణులను వెలుగులోకి తెచ్చాయి. చెరబండ రాజు, గద్దర్, వరవరరావు వంటి కవులలో విప్లవ భావజాలం ప్రధానంగా ప్రతిఫలించగా, సినారె, ఎన్. గోపి కవిత్వాలలో మానవతా విలువలు, విశ్వమానవ దృక్పథం ప్రముఖంగా కనిపిస్తాయి. ఈ అధ్యయనాలు ఆధునిక తెలుగు కవిత్వంలోని భావజాల వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి విలువైన ఆధారాలుగా నిలుస్తాయి.

### కవి / రచయితల దళిత సాహిత్యం, దళిత చైతన్యం అంశాలపై పరిశోధనలు

1."గోగు శ్యామల కథల్లో దళిత స్త్రీవాద దృక్పథం" – 2024, ఉస్మానియా విశ్వవిద్యాలయం – ఎస్. హరిత.,గోగు శ్యామల మెదక్ జిల్లా (ప్రస్తుత సంగారెడ్డి ప్రాంతం)కు చెందిన ప్రముఖ దళిత రచయిత్రి, సామాజిక కార్యకర్త. నల్లరేగడిచాళ్లు, ఏనుగంత తండ్రి కన్నా ఏకుల బుట్టంత తల్లి నయం వంటి కథా సంపుటాల ద్వారా దళిత మహిళల జీవితం, కుల-లింగ వివక్ష, సామాజిక అసమానతలను ప్రతిబింబించారు. ఈ పరిశోధన ఆమె కథల్లోని దళిత స్త్రీవాద దృక్పథాన్ని విశ్లేషించింది.,."జూలూరి గౌరీశంకర్ కవిత్వంలో దళిత చైతన్యం" – 2022, కాకతీయ విశ్వవిద్యాలయం – డి. మల్లికార్జున్,జూలూరి గౌరీశంకర్ వరంగల్ జిల్లాకు చెందిన కవి, విమర్శకుడు, సంపాదకుడు. తెలంగాణ అస్తిత్వ సాహిత్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. పొక్కిలి వంటి సంకలనాల సంపాదకత్వంతో పాటు అనేక కవితా రచనలు చేశారు. ఆయన కవిత్వంలో వ్యక్తమైన దళిత చైతన్యం, సామాజిక న్యాయ దృక్పథాన్ని ఈ పరిశోధన పరిశీలించింది.,."బోయ జంగయ్య రచనల్లో దళిత జీవన దృక్పథం" – 2023, కాకతీయ విశ్వవిద్యాలయం – పి. స్వప్న, బోయ జంగయ్య యాదాద్రి-భువనగిరి జిల్లా లింగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ప్రముఖ దళిత రచయిత. జాతర, జగడం, అంబేద్కర్, నడుస్తున్న చరిత్ర వంటి రచనల ద్వారా దళితుల జీవన వాస్తవాలు, సామాజిక అసమానతలు, స్వాభిమాన పోరాటాలను చిత్రించారు. ఈ పరిశోధన ఆయన రచనల్లో ప్రతిఫలించిన దళిత జీవన దృక్పథాన్ని విశ్లేషించింది. ఈ పరిశోధనలు తెలంగాణ దళిత సాహిత్యంలో కుల అణచివేత, సామాజిక అసమానతలు, స్వాభిమాన చైతన్యం, దళిత స్త్రీవాద దృక్పథం వంటి అంశాలను వెలుగులోకి తెచ్చాయి. గోగు శ్యామల రచనల్లో దళిత మహిళల అనుభవ ప్రపంచం, జూలూరి గౌరీశంకర్ కవిత్వంలో దళిత చైతన్యం, బోయ జంగయ్య రచనల్లో దళిత జీవన వాస్తవాలు ప్రధాన అధ్యయన అంశాలుగా నిలిచాయి.



**డా. ఐ. చిదానందం**
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి

- శ్రీ దత్తా ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ



**ఇబ్రహీంపట్నం, జూన్ 25 (జనం సాక్షి) :** శ్రీ దత్తా ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాచకొండ కమిషనరేట్, మహేశ్వరం జోన్, ఇబ్రహీంపట్నం పోలీసుల ఆధ్వర్యంలో షేరిగూడలోని కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం జోన్ డీసీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబాలు, సమాజం తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. యువత వీటికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని, సమాజంలో మార్పు కోసం యాంటీ డ్రగ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు.కళాశాల చైర్మన్ జి. పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు లోనుకాకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు,ఎస్‌హెచ్‌ఓ మహేందర్ రెడ్డి,కళాశాల అధ్యాపకులు, సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పేరుతో భారీ మోసం

- మంజూరు పత్రాలు అందజేసి వందమంది నుంచి రూ.కోటి వసూలు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో నలుగురు

**సికింద్రాబాద్, జూన్ 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇప్పిస్తామని నమ్మించి పేద ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన మోసగాళ్ల ముఠాను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏడుగురు సభ్యుల ముఠాలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసివారి వద్ద నుంచి 79 నకిలీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు ధృవపత్రాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ప్రధాన సూత్రధారి ఇప్పటికే చనిపోగా మిగతా ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ మేరకు మల్కాజ్గిరి జోన్ డిసిపి శ్రీధర్ సికింద్రాబాద్ లో మీడియాకు వివరాలు వెల్లడించారు. తిరుమలగిరికి చెందిన తిమ్మిరి గోపీనాథ్ పుష్పలత (54) జిహెచ్ఎంసి లో కాంట్రాక్టు ఉద్యోగం చేసేది. సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో అల్వాల్ కు చెందిన జయరాజు గంగాధరన్ అనే వ్యక్తితో కలిసి డబుల్ బెడ్ రూమ్ మంజూరు పేరుతో ప్రజలను మోసం చేసి డబ్బులు లాగాలని ప్లాన్ చేశారు. తమ ప్లాన్ లో భాగంగా పేద,ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించారు. ప్రధాన నిందితురాలు తిమ్మిరి గోపీనాథ్ పుష్పలత జిహెచ్ఎంసి లో ఉన్నత స్థాయి ఉద్యోగినని చెప్పి బాధితుల్లో విశ్వాసం కల్పించింది.ఈ క్రమంలో ఒక్కో బాధితుడి నుంచి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు 'ప్రాసెసింగ్ చార్జీలు' పేరుతో వసూలు చేశారు. ఇలా సుమారు 99 మంది బాధితుల నుంచి కోటి రూపాయల వరకు వసూలు చేశారు. డబ్బులు తీసుకున్న అనంతరం నకిలీ కేటాయింపు పత్రాలు అందజేశారు. మంజూరు పత్రాలు నకిలీ అని తెలుసుకున్న బాధితులు వారిని నిలదీయడంతో అసలు పత్రాలు ఇస్తామని నమ్మబల్కుతూ వచ్చారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు ఇళ్ల కోసం ఎదురు చూసిన బాధితులు చివరకు మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం పుష్పలతకు లక్ష రూపాయలు వరకు ముట్ట జెప్పిన చెప్పిన అల్వాల్ చెందిన బాధితుడు గొగికర్ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జూన్ 24న తిమ్మిరి గోపినాథ్ పుష్పలత (54), నకిలీ కేటాయింపు ధృవపత్రాల తయారీలో కీలక పాత్ర పోషించిన పుష్పలత కుమారుడు తిమ్మిరి గోపినాథ్ విశాల్ (21), నకిలీ పత్రాల రూపకల్పన, వాటి ముద్రణలో కీలకంగా వ్యవహరించిన తిరుమల గిరిలోని జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు మహేందర్ సింగ్ (45)లను అరెస్ట్ చేశారు. అదే సమయంలో ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న జయరాజ్ గంగాధరన్, అతని కూతురు నిషారాజ్ , కుమారుడు చింటు రాజ్ , నకిలీ పత్రాల తయారీకి అవసరమైన స్టాంపులు తయారుచేసిన రాణిగంజ్ కు చెందిన రాజ్ అండ్ కో. రబ్బర్ స్టాంప్స్ తయారీ నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. వారిని పట్టుకు నేందుకు ప్రత్యేక చర్యలు



చేపట్టినట్లు తెలిపారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న గంగాధరన్ కొద్ది నెల్ల క్రితం మరణించాడని కుటుంబ సభ్యు లు,స్థానికుల ద్వారా తెలిసిందని అయితే ఈ విషయం ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదని డీసీపీ వెల్లడించారు. ఈ విషయమై లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

### దళారుల నుంచి అప్రమత్తంగా ఉండండి

ప్రభుత్వ ఉద్యోగాలు, బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని చెప్పి వచ్చే దళారుల మాటలు నమ్మి ప్రజలు మోసపోరాదని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, భూ కేటాయింపులు లేదా ఇతర ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు తీసుకుని హామీలు ఇచ్చే వ్యక్తులను నమ్మవద్దని పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# సిపీఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు యూటిఎఫ్ నిరసన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 25 (జనంసాక్షి) :** టీఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసి అనంతరం జాయింట్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర జాబితాలో నుండి ఉమ్మడి జాబితాలోకి వెళ్లిన విద్యను నేడు కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపి2020 అనే చట్టం పేరుతో కేంద్రం గుప్పెట్లో పెట్టుకొని విద్య కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయడాన్ని నిరసిస్తు వెంటనే ఎన్ఈపి 2020ను రద్దు చేయాలన్నరు సిపిఎస్ విధానాన్ని రూపుమాపి ఒపిఎస్ విధానాన్ని అమలు చేసి అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నరు అలాగే కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు టెట్ నుండి సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులను పూర్తిగా మినహించాలన్నారు.15 సంవత్సరాల క్రితం నిర్ణయించిన ఇన్కమ్ టాక్స్ విధానాన్ని సవరించి ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ నుండి ఉపశమనం కల్పించాలన్నారు అనంతరం టీఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ జులై 2023 నుంచి అమలు చేయాల్సిన పిఆర్సీని వెంటనే రిపోర్ట్ అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఐదు




డిఏలను విడుదల చేయడంతో పాటు పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులను ఏక మొత్తంగా విడుదల చేయాలన్నరు. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 27 వేల పాఠశాలలను నాలుగువేల పాఠశాలలుగా కుదిస్తామని అనడాన్ని తప్పు పడుతూ పిల్లలు ఉన్న ప్రతి దగ్గర పాఠశాల ఉండాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూపొందించి కళాశాలల లెక్చరర్ పోస్టులకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 15% నిధులు కేటాయించి అన్ని రకాలుగా పాఠశాలలను అభివృద్ధి చేసి పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యను అందుబాటులో కి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కల్పన, కోశాధికారి జగన్నాథ్ శర్మ,రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ .వెంకటయ్య,శివారెడ్డిభగవంత్ రాజ్ బుగ్గరాములు నర్సిములు భువనేశ్వరి శ్యామలదేవి బిజిలి సత్యం, రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణకు టీకేఎస్ కృషి

- ఘనంగా టీకేఎస్ రాష్ట్ర మహాసభలు..

**ముషీరాబాద్, జూన్ 25 (జనం సాక్షి) :** కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం తెలంగాణ కార్మిక సమాఖ్య (టీకేఎస్) నిరంతరం పోరాడుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈమెలకు గురువారం బాగ్లింగంపల్లిలోని సుందర విజ్ఞాన కేంద్రంలో వశపాక నరసింహ అధ్యక్షతన టీకేఎస్ 6వ రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సభకు మాజీ శాసనమండలి స్పీకర్ మధుసూదనాచారి, కలకోట రామన్న, టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ భిక్షమయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, కొలా జనార్ధన్ గౌడ్, పల్లెల వీరాస్వామి, డా. అప్పికట్ల భరత్ భూషణ్ తదితరులు హాజరై మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం టీకేఎస్ పోరాటం కొనసాగిస్తోందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయడం, కార్మికులకు గృహ వసతి, వైద్యం, విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. మహాసభలో కార్మికులకు ఇంటి స్థలాలు, ఉచిత బీమా, ఆరోగ్యశ్రీ సౌకర్యం, కార్మికుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రాధాన్యత, భూములు కోల్పోయిన




కుటుంబాలకు నష్టపరిహారం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాతాకుల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి బందెల యాదగిరి, ఉపాధ్యక్షుడు మహ్మద్ రజాక్, మహిళా అధ్యక్షురాలు చిలుముల్ల సుజాత, కొండపల్లి లక్ష్మి, నెమలిపురి నాగమణి, సాంటి రత్నకుమారి, అల్వాల వెంకన్న, బండా నర్సింహ, దువ్వలగట్టు శేఖర్, ముంతాజ్ బేగం, ఫైమా బేగం, మచ్చ చంద్రయ్య, కొమ్ము లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**రామాయంపేట, జూన్ 25 (జనం సాక్షి) :** రామాయంపేట మండలంలో జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిపిఎం రామాయంపేట ఏరియా కమిటీ నాయకులు నీలం బాబు డిమాండ్ చేశారు. గురువారం ఏఎంసీ కార్యాలయంలోని జొన్నల



కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. జొన్న రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు నెలలుగా రైతులు జొన్నల విక్రయానికి పడుతున్న అవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పంట మార్పిడి చేయాలని, ఆరుతడి పంటలను ప్రోత్సహించిన ప్రభుత్వమే, రైతులు పండించిన జొన్నలను సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన జొన్నలను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే సేకరించిన జొన్నలలో మూడు లారీల లోడ్‌ను తిరిగి రైతులకు పంపడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఈ పంట అమ్మగా వచ్చిన డబ్బులతోనే తదుపరి పంటకు సిద్ధమవ్వాలని భావించిన రైతులకు, చేతికి డబ్బులు అందకపోగా, రైతు భరోసా కూడా రాక తీవ్ర కష్టాల్లో ఉన్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి, జొన్నలను తక్షణమే కొనుగోలు చేసి, రైతులకు రావాల్సిన చెల్లింపులను వెంటనే అందజేయాలని సీపీఎం పార్టీ నాయకులు నీలం బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# యాచారం ఆసుపత్రిలో అడుగడుగునా అవస్థలు

- కోట్లాది రూపాయల నిధులు ఏమాయ్యాయి...?
- విచారణ జరపాల్సిందే..
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**యాచారం, జూన్ 25 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సీపీఎం పార్టీ రాష్ట్ర బృందం అకస్మాత్తుగా సందర్శించి, అక్కడ ఉన్న దుర్భర పరిస్థితులను పరిశీలించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, గతంలో 30 పడకలతో అన్ని రకాల వైద్య సేవలు అందించిన ఈ ఆసుపత్రి, ప్రస్తుతం నిధుల దుర్వినియోగం మరియు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా నాశనమైందని మండిపడ్డారు. 2021లో అప్పటి ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ. 1.50 కోట్ల నిధులు మంజూరు చేస్తే, అధికారులు ఆ సొమ్మును సక్రమంగా ఉపయోగించకుండా పక్కదారి పట్టించారని ఆయన ఆరోపించారు. తాత్కాలిక పనుల పేరుతో కేవలం నాసిరకమైన రంగులు వేసి రూ. 50 లక్షల ప్రజాధనాన్ని దుబారా చేశారని, దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేవని, వైద్యులు సకాలంలో రాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రాత్రి వేళల్లో ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందించాలని, ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, శానిటైజర్ సిబ్బందికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఆసుపత్రిలో కనీసం తాగడానికి మంచినీరు, మరుగుదొడ్లు, అండర్ డ్రైనేజీ సదుపాయాలు లేక రోగులు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే ఈ ఆసుపత్రిని సందర్శించి నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య రంగ సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు బోడ సామిల్, డి. రామచందర్, డి. జగదీష్, కందుకూరి జగన్, ఆలంపల్లి నరసింహ, పి. అంజయ్య, అలంపల్లి జంగయ్య, ఎస్. చందు నాయక్, పి. వెంకటయ్య, ఉడుతల జంగయ్య, మండల బాల్రాజ్, కావాలి జగన్, డి. పెద్దయ్య, కేతావత్ నాయక్, విప్లవ కుమార్ మరియు పలు గ్రామాల పార్టీ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

- జిల్లా అదనపు కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 25 (జనంసాక్షి) :** నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరమని అదనపు జిల్లా కలెక్టర్ డాక్టర్. కొప్పిశెట్టి కిరణ్మయి అన్నారు రంగారెడ్డి జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి




సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు వికసిత్ భారత్‌కు నషా ముక్త్ భారత్ పునాది"అని ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆమె అన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు డ్రగ్స్ మరియు మద్యం ఆల్కహాల్ అనేక నేరాలు, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను డ్రగ్స్ మరియు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, "నాకెందుకులే" అనే నిర్లక్ష్య భావనకు బదులుగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజం సురక్షితంగా, ఆరోగ్యకరంగా ఉంటేనే వ్యక్తులు, కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని తెలిపారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ సహకరిస్తారని, అందరూ కలిసి పనిచేస్తేనే నేరాలు మరియు సామాజిక సమస్యలను సమర్థవంతంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అందరి చేత "నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఎఓ సునీల్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు జూన్ 25 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వమే నెరవేరుస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు మండలంలోని గుంతబచ్‌పల్లి, ఐనెల్లి, గౌతపూర్ గ్రామాల్లో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గుంతబచ్‌పల్లిలో శ్యామలమ్మ చంద్రయ్య గౌడ్, ఐనెల్లిలో ప్రమీలమ్మ వెంకటప్ప, వడ్డే మల్లమ్మ, గౌతపూర్‌లో రస్నం ఇంద్రజాల చంద్రశేఖర్ రెడ్డి గార్ల నూతన గృహాలను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు పక్కా ఇల్లు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు.తమ సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా గుడిసెల్లో, అద్దె ఇళ్లలో ఉన్న తమకు ఇప్పుడు సొంత పక్కా ఇల్లు వచ్చిందని సంబరపడ్డారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సమగ్ర అభివృద్ధికే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు
- గ్రామ, వార్డు సభల నిర్వహణతో సమస్యల గుర్తింపు
- జిల్లా ప్రత్యేక అధికారి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా
- కలెక్టరేట్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి సమీక్ష
- పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, వివిధ శాఖల జిల్లా అధికారులు



**గద్వాల నడిగడ్డ, జూన్ 25 (జనం సాక్షి) :** సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను గుర్తించి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రత్యేక అధికారి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా అన్నారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా గ్రామ, వార్డు సభల నిర్వహణతో కిందిస్థాయి నుంచి కూడా ప్రజల సమస్యలను గుర్తించడమే కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు గురించి ఆయా శాఖల అధికారులు వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం 10 థీములతో షెడ్యూల్ ప్రకారం ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం జరిగిందని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును నిరంతర ప్రక్రియగా పేర్కొంటూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. కొన్ని విషయాల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉదాహరణకు అంగన్వాడి కేంద్రాలను తీసుకుంటే తాగునీరు, విద్యుత్ సదుపాయం వంటి సమస్యలు ఎక్కడైనా ఉంటే పరిష్కరించేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ఆరోగ్యశాఖలో ఇదివరకు గుర్తించిన టిబి కేసులతో పాటు కొత్తగా ఇతర కేసులను గుర్తించి డేటా రూపకల్పనకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇలా ప్రతి శాఖలో ఏమైనా సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాక ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ దోహద పడిందన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. మార్చి ఆరవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పాత ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 99 రోజుల షెడ్యూల్ ప్రకారం వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వివిధ మరమ్మత్తులను చేపట్టామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను గురించి తెలిపారు. గట్టు మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కు ఎంపికవడంతో నిర్దేశిత పారామీటర్స్‌లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించడం జరిగిందన్నారు. బాల్యవివాహాలతో బతుకు ఆగం అనే నినాదంతో జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. పోక్సో కేసులను తగ్గించేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపట్టామన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ వారోత్సవాల్లో రహదారి భద్రతపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఉద్యానవన, క్రీడలు యువజన సర్వీసులు, సంక్షేమ, అటవీ, తదితర శాఖల ఆధ్వర్యంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల గురించి కూడా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. అంతకుముందు జిల్లా ప్రత్యేక అధికారి, కలెక్టర్ జిల్లాలో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేసిన తమ కార్యక్రమాల గురించి పిపిటి ద్వారా వివరించారు. అనంతరం జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పుస్తకాలను జిల్లా ప్రత్యేక అధికారి, కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**పటాన్‌చెరు, జూన్ 25 (జనంసాక్షి) :** సంగారెడ్డి, జిల్లా పటాన్చేరు నియోజకవర్గం మహేశ్వర మెడికల్ కాలేజ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మహేశ్వర మెడికల్ కాలేజ్ యాజమాన్యం "నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్‌కి పహచాన్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూన్ 17 నుండి 26 వరకు నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్ -- 2026" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లలితా దేవి, విద్యాశాఖ విభాగం నుండి సిద్ధారెడ్డి మహేశ్వర మెడికల్ కాలేజ్ అధ్యాపకులు ప్రిన్సిపాల్ మరియు డీన్ పటాన్చెరువు ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ రాములు బాలల సంరక్షణ అధికారి రత్నం తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయానికి సమష్టి కృషి అవసరం

- గుమ్మడిదలలో విస్తృత అవగాహన సమావేశం



**గుమ్మడిదల, జూన్ 25 (జనం సాక్షి) :** జూన్ 28 ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గుమ్మడిదల మున్సిపాలిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, కౌన్సిలర్లు, ఆరోగ్య శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ మున్సిపాలిటీ,పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి కార్యక్రమంపై పూర్తి సమాచారం చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పల్స్ పోలియోపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చెత్త సేకరణ వాహనాల ద్వారా మైక్ ప్రచారం నిర్వహించడంతో పాటు దేవాలయాలు, మసీదులు, చర్చిల ద్వారా కూడా ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, ఆరోగ్య కార్యకర్తలు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ పేర్కొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారము ప్రవేట్ ఆస్పత్రులు నిర్వహించాలి
- జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ




**నాగర్‌కర్నూల్, జూన్ 25 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో అమ్మాయిల లింగ నిష్పత్తి తక్కువగా ఉంది, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ తెలిపారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో మినీ సమావేశ మందిరంలో ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్, పీడియాట్రిషన్ లకు లింగ నిర్ధారణ నిషేధ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, గర్భస్రావ చట్టం, సంకల్ప్ కార్యక్రమం గురించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ, అమ్మాయిల సంఖ్య తగ్గితే సమాజంలో అసమతుల్యత ఏర్పడి తీవ్రమైన దుష్ప్రభావాలు కలుగుతాయని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదని ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు, చేయించుకున్నవారు, సహకరించిన వారు అందరూ శిక్షార్హులు. కావున లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదు అని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. గర్భవతుల అందరికీ సాధారణ ప్రసవాలు నిర్వహించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అత్యవసరమైతే తప్ప సిజరియన్ కాన్పులు చేయాలని తెలియజేశారు. తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ లో ప్రతి ప్రైవేటు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ చేసుకొని, వారు గుర్తించిన క్యాన్సర్ కేసుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని తెలియజేశారు. అంటువ్యాధుల వివరాలను ఐహెచ్‌ఐపి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా, వెంటనే నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ఇంటి వ్యాధులు ప్రజలకుండా చేయవచ్చని తెలియజేశారు. కష్టతరమైన కాన్పులు నిర్వహించినప్పుడు చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రిలో తాము అందించే సేవలు రుసుముల పట్టికను తప్పకుండా ప్రదర్శించాలని తెలియజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ, గర్భవతులకు సాధారణ ప్రసవాలు చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, మాత శిశు మరణాలు అరికట్టడానికి తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ రఫిక్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి, ఏపీ డెమియాలజిస్ట్ ప్రవల్లిక, హెల్త్ ఎడ్యుకేటర్ బాలస్వామి, డిడిఎం నవీన, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.

# సర్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక
- ఘనంగా 2కే రన్




**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక పిలుపు నిచ్చారు. చనిపోయిన వ్యక్తుల పేర్లు, డబుల్ ఓట్లను తొలగించడమే సర్ ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె పేర్కొ న్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్య క్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 2 కే రన్ నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభ మైన ఈ రన్ పట్టణంలోని సత్య నారాయణ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ 2కే రన్ కు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రియాంక కలెక్టరేట్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఓటర్ల పేర్లు తొలగించేందుకు కాదని, ఓటరు జాబితా మరింత ప్రామాణికంగా రూపొందిం చేందుకు చేపడుతున్న ప్రక్రియ అని ఆమె తెలిపారు. గురువారం నుంచి వచ్చే నెల 24 వరకు ఈ ప్రక్రియ కొన సాగుతుందని చెప్పారు. జిల్లాలోని ప్రతీ ఓటరుకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఓటర్లు ఆ ఫారాలు నింపి తిరిగి సమ ర్పించడం ద్వారా తమ పేరు ఓటరు జాబితాలో కొనసా గుతున్నట్లు నిర్ధారించు కోవాలని సూచించారు. నిజమైన ఓటరు జాబితా తయారు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. 2 కే రన్ లో పాల్గొన్న వారందరికీ ఈ సందర్భంగా ఆమె ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డీఎస్పీ నల్లపు లింగయ్య, కలెక్టరేట్ ఏవో అనిల్, డీ వై ఎస్ వో వెంకటేష్ శెట్టి, డీ పీ ఆర్ వో రషీద్, సీ. ఐ. శివ శంకర్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యా యులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

- మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఎంత ముఖ్యమో, యువత భవిష్యత్తుకు మాదకద్రవ్యాల రహిత సమాజం అంతే అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ, మాదకద్రవ్యాల నిర్మూలన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గురువారం నిర్వహించిన 2కె పరుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఖచ్చితమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోందని, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా యువత మంచి లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల విక్రయం, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత చెడు అలవాట్ల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి) :** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వసతి, సౌకర్యాలు, మరమ్మత్తులు, పరిశుభ్రత తదితర అంశాలపై సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అభ్యసించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ప్రతి వసతి గృహంలో స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ఫ్యాన్లు, లైట్లు, గాలి వెలుతురు వంటి సదుపాయాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైన మరమ్మత్తుల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని సూచించారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారి ఆరోగ్యం, భద్రత, విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని హాస్టల్ సంక్షేమ అధికారులకు కలెక్టర్ సూచించారు. బాలికల వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకటేష్, డీఎస్‌సీడీవో జగదీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి



**గద్వాల నడిగడ్డ, జూన్ 25 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ, కార్యక్రమంలో "వాల్ ఆఫ్ ప్రామిస్" లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఎస్పీ టి శ్రీనివాసరావు తో కలిసి పాల్గొన్నారు. మొదటగా ఐ.డి.ఓ.సి. ఆఫీస్ నుంచి 2ఖ రన్ ను జండా ఊపి ప్రారంభించగా, ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ చౌక్ మీద నుండి కృష్ణ వేణి చౌక్ చేరుకున్నది. అక్కడ ఏర్పాటుచేసిన బ్యానర్లో సంతకం చేశారు. గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి కృషి చేస్తానని తన ప్రతిజ్ఞను చేశారు. డ్రగ్స్ మరియు మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ మద్దతు ను తెలియజేసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై సమాజమంతా కలిసి పోరాడాలని, డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ "వాల్ ఆఫ్ ప్రామిస్" పై సంతకం చేసిన ప్రతి ఒక్కరూ గంజాయి రహిత సమాజ నిర్మాణానికి పోరాడుతూ, గంజాయి బారిన పడిన వారి సమాచారం, గంజాయిపై ఉన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తామనే బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి బారిన పడిన యువతకు సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని, పునరావాస కేంద్రాల ద్వారా నయం చేసి తిరిగి సాధారణ జీవితాన్ని గడిపేలా పోలీసు యంత్రం కృషి చేస్తుందని, తల్లిదండ్రులు డ్రగ్స్ బారిన పడిన వారిని చికిత్స కేంద్రాలకు తరలించి చికిత్సను అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా పోరాడుతామని డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ సోల్జర్ వద్ద ఫోటోలను దిగి తమ సామాజిక మాధ్యమాల కేంద్రాలలో పొందుపరచాలని జిల్లా ఎస్పీ సూచించారు. మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని సంతకాలు చేసి, యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఏర్పాటు చేసిన పోస్టర్ల వద్ద చాయచిత్రాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు నర్సింగ రావు, మధన్ మోహన్, అదనపు ఎస్పీ కె శంకర్, ఏ. ఆర్. డి ఎస్పీ టి నరేందర్ రావు, చైల్డ్ లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, ఆర్ఐలు నరేష్, వెంకటేష్, హరీఫ్, ఆర్. ఎస్సై బాలచంద్రుడు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- భూ భారతి దరఖాస్తులను 60రోజుల్లోగా పరిష్కరించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో , జూన్ 25, (జనంసాక్షి) అన్ని విభాగాల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల సూపరిండెంట్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి కింద స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత గడువు 60 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి విభాగానికి సంబంధించిన రికార్డులను క్రమం తప్పకుండా పరిశీలించి, ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు సక్రమంగా భద్రపరచాలని సూచించారు. కలెక్టరేట్ ఉద్యోగుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని హెచ్చరించారు. ప్రతి విభాగం పరిధిలోని ఉద్యోగుల వివరాలు, పెండింగ్ అంశాలపై సమగ్ర సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, వివిధ విభాగాల సూపరిండెంట్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయం

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి): జిల్లాలో చేపట్టిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంలో అధికారుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలన అధికారి ఛాంబర్ లో రాష్ట్రంలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో 1 కోటి 50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగినందున తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సన్న రకం బియ్యంతో తయారుచేసిన 7 రకాల పిండి వంటల కిట్లను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ యాసంగి వరి ధాన్యం, మొక్క జొన్నలు, జొన్నల కొనుగోలు నిర్ణీత గడువులోగా రైతులకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడంలో అధికారులకు కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్

- విద్యార్థులకు జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచన
- కాగజ్ నగర్ లోని ఫాతిమ హై స్కూల్ నందు డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ
- డ్రగ్స్ అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ప్రదర్శన




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా హై స్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ అనేవి వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల నాడీ వ్యవస్థ పనితీరులో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. విద్యార్థి దశ నుండే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాల గురించి వివరించారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసినట్లయితే వెంటనే 1908 డ్రగ్స్ కంట్రోల్ హెల్ప్‌లైన్, 112 ఎమర్జెన్సీ నంబర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై రూపొందించిన షార్ట్ ఫిలిమ్స్‌ను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల యువత జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో, వాటికి దూరంగా ఉంటేనే విజయవంతమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని చిత్రాల ద్వారా వివరించారు. అనంతరం నో టు డ్రగ్స్ , ఎస్ టు లిఫెస్ అని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరీ,పాఠశాల మేనేజర్ మెరిటా, ఉపాధ్యాయులు, ఇన్స్ట్రక్టర్స్ ప్రేమ్ కుమార్, కుమార స్వామి , సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మొరం తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్ మృతి
- శంకరం తండాలో ఘటన



చెన్నారావుపేట, జూన్ 25 ( జనం సాక్షి): మొరాన్ని తరలిస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని శంకరం తండా గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... ఇదే శంకరం తండాకు చెందిన భూక్య రాజు లింగగిరి గ్రామంలోని ఊర చెరువులో మొరం నడుస్తుండగా బుధవారం రాత్రి 8 గంటల సమయంలో తన సొంత ట్రాక్టర్ (టిఎస్ 24 టిఏ 1159)లో మొరాన్ని తీసుకు వస్తున్నాడు. శంకరం తండా స్మశాన వాటిక దగ్గరికి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో భూక్య రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న ధారావత్ రవి గమనించి రాజు తండ్రి భూక్య మోహన్ కు సమాచారం అందించాడు. వెంటనే తీవ్ర గాయాల పాలైన రాజును చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

# వడలో బల్లి కలకలం..

- టిఫిన్ సెంటర్‌కు రూ.10 వేల జరిమానా..
- వారం రోజుల సీజ్
- నిత్య తనిఖీలపై ప్రజల డిమాండ్...





వరంగల్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) : ఇటీవల వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఎస్ఆర్ఆర్ తోటలో పెరుగు ప్యాకెట్లో ఎలుక పిల్ల వచ్చిన సంఘటన మరదకముందే వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశీబుగ్గలోని అన్నపూర్ణ టిఫిన్ సెంటర్‌లో వడలో చనిపోయిన బల్లి కనిపించడం గురువారం కలకలం రేపింది. ఉదయం టిఫిన్ చేసేందుకు వచ్చిన ఓ వినియోగదారుడు వడ ఆర్డర్ చేయగా, తింటున్న సమయంలో వడలో బల్లి శరీరం కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో బాధితుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు అందుకున్న వరంగల్ ఫుడ్ సేఫ్టీ అధికారి మౌనిక ఆధ్వర్యంలో అధికారులు టిఫిన్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో పరిశుభ్రత లోపాలు, ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు యాజమాన్యంపై రూ.10 వేల జరిమానా విధించారు. అలాగే హోటల్‌ను వారం రోజుల పాటు సీజ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన మరమ్మతులు, పరిశుభ్రత ప్రమాణాలు అమలు చేసిన అనంతరం మాత్రమే తిరిగి కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు.తనిఖీల సందర్భంగా మున్సిపల్ సిబ్బంది కూడా హోటల్‌ను పరిశీలించారు. హోటల్ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని గుర్తించి, వెంటనే డ్రైనేజీ ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని నిబంధనలు పాటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి మౌనిక మాట్లాడుతూ.. బజ్జీల బండ్ల నుంచి టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్ల వరకు ఆహార పదార్థాల తయారీలో నాణ్యమైన నూనె మాత్రమే వినియోగించాలని సూచించారు. ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వాడటం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. పరిశుభ్రత, నాణ్యత విషయంలో ఆహార వ్యాపారులు రాజీ పడొద్దని సూచించారు.తనిఖీల అనంతరం స్థానిక ప్రజలకు ఆహార భద్రతపై అవగాహన కల్పించారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాళ్లలో నాణ్యతా లోపాలు, పరిశుభ్రత సమస్యలు కనిపిస్తే నేరుగా ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది నరేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిత్య తనిఖీలు చేయాలంటూ ప్రజల డిమాండ్

వడలో బల్లి ఘటన నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ శాఖ పనితీరుపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బేకరీలు, బార్‌లకు అనుబంధంగా ఉన్న ఫుడ్ అవుట్‌లెట్లలో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. ఏదైనా ఘటన జరిగిన తర్వాత మాత్రమే స్పందించి జరిమానాలు విధించడం కాకుండా, ముందస్తు తనిఖీలతో లోపాలను గుర్తించి సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు. వరంగల్ నగరంలో ఫుడ్ సేఫ్టీ శాఖ తనిఖీలు ఎప్పుడు జరిగాయో కూడా తెలియని పరిస్థితి ఉందని, ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిత్య పర్యవేక్షణ అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

## విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- కాగజ్ నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పర్యటన
- మెరుగైన విద్యుత్ సరఫరాకు కీలక ఆదేశాలు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 25(జనంసాక్షి): టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ గురువారం కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా లోని కాగజ్ నగర్ డివిజన్‌లో పర్యటించి పలు విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. విద్యుత్ సరఫరా నాణ్యత, సేవల పరంగా మరింత మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ డివిజన్ లోని దహెగాం నుండి బెల్లంపల్లి డివిజన్ లోని కన్నెపల్లి మధ్యలో 20 కిలోమీటర్ల ఇంటర్ లింకింగ్ లైన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ లైన్ వారంలో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. దహెగాం,పెంచికల్ పెట్ పరిసర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా (ఆల్టర్నేటివ్ సప్లై ) అందుబాటులోకి రావడం ద్వారా సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అయినపుడు, భారీ వర్షాలు ఈదురుగాలుల సమయంలో కూడా వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించవచ్చని తెలిపారు. అనంతరం బెజ్జూరు, దహెగాం, కౌటాల, సిర్పూర్ (టి ) 33 /11 కెవి, సబ్ స్టేషన్లను సందర్శించి ఆర్ అండ్ యం పనులు చాల బాగా చేశారని అక్కడి అధికారులను అభినందించారు. అక్కడే ఆపరేషన్ సిబ్బంది తో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత అత్యంత కీలకమని, భద్రతపరికరాలు లేకుండా పనులు చేయవద్దని హెచ్చరించారు. ఎల్సీ యాప్ ద్వారానే ఎల్సీ లు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి కేవలం ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించలని అన్నారు. ఈ ప్రత్యేక భద్రతా విధానం ద్వారా విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, సిబ్బంది ప్రాణాలను రక్షించడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా నిర్వహించడం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున, ఈ ఒక్క నిమిషం జాగ్రత్త సిబ్బంది ప్రాణాలను కాపాడగలదని ఆయన పేర్కొన్నారు. ప్రమాదభరింతగా ఉన్న లైన్లు , వంగిన పోల్ లను సరిచేయాలని ఆదేశించారు . తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ గద్దెలను ఎత్తు పెంచాలని తెలిపారు. లూజ్ లైన్లలో మధ్య స్తంభాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అటవి ప్రాంతం అయిన వేంపల్లి నుండి పెద్దబండ వరకు, సారసాల నుండి ఎల్కపల్లి వరకు మొత్తం సుమారు 19 కిలో మీటర్ల మేర కవర్డ్ కండక్టర్ పనులు కొనసాగుతున్నాయని సీఎండీ తెలిపారు. అటవీ ప్రాంతంలో చెట్లు విరిగి లైన్ల మీద పడటం వలన అంతరాయాలు ఏర్పడుతాయని వాటిని నివారించడానికి కవర్డ్ కండక్టర్ ఎంత గానో ఉపయోగ పడుతుందని వివరించారు. బెజ్జూరు నుండి కర్జవల్లి వరకు 20 కిలో మీటర్ల ఇంటర్ లింకింగ్ లైన్ పనుల వారం లోపల పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యం అని ,విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం ద్వారా మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాంఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ కాగజ్ నగర్ సి నాగరాజు, డిఈ టెక్నికల్ సుధాకర్, ఈఈ సివిల్ శ్రీనివాస్ , అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు ఏ ఈ లు ఇతర ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విగ్రహాల తొలగింపు ప్రక్రియ





కాళేశ్వరం, జూన్ 25 (జనంసాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా విగ్రహాల తొలగింపు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. తమిళనాడు శిల్పుల ఆధ్వర్యంలో విగ్రహాలు తొలగించి వాటిని భద్రపరిచేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శ్రీ రాజరాజేశ్వర వసతి గృహంలోని హాలులో ప్లైవుడ్ బాక్సులు ఏర్పాటు చేసి వాటిలో ధాన్యాన్ని నింపి విగ్రహాలను భద్రపరుస్తున్నారు. గురువారం నాటికి దాదాపు మొత్తం విగ్రహాల తొలగింపు ప్రక్రియ పూర్తయింది. గర్భగుడిలోని ద్విలింగాల చుట్టూ ధాన్యం నింపి ప్లైవుడ్ బాక్సుల తో మూసి వేశారు. భారీ విగ్రహాలైన హనుమాన్ , కాలభైరవ , మత్స్య విగ్రహాలను తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 25 మంది శిల్పులు తొలగింపు ప్రక్రియలో పాల్గొంటున్నారు. విగ్రహాలను తొలగించే పనులను ఫోటోలు వీడియోల ద్వారా చిత్రీకరిస్తున్నారు. టెండర్లు ఖరారు అయిన తర్వాత ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ ప్రాకారంలోని విగ్రహాలను , ఉపాలయాల విగ్రహాలను పూర్తిగా తొలగించి భద్రపరిచారు. ఆలయంలో ఏర్పాటుచేసిన రేకుల షెడ్లను కూడా సిబ్బంది తొలగిస్తున్నారు. ఈనెల 23న టెండర్ల ప్రక్రియ జరగాల్సి ఉండగా మంత్రి శ్రీధర్ బాబు విదేశీ పర్యటన నేపథ్యంలో వాయిదా పడినట్లు తెలిసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత మొదటగా గర్భగుడి , అమ్మవారి ఆలయ పనుల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల లోపు కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనానికి భక్తులను అనుమతించే విధంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

## క్షేత్రస్థాయిలో సమగ్ర అభివృద్ధికే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

- అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు - సమస్యల పరిష్కారానికి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- జెన్కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీష్ ఐఏఎస్



మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 25 (జనం సాక్షి): ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా అమలైందని జిల్లా ప్రత్యేక అధికారి, జెన్కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్ ఐఏఎస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అనువైన వాణిజ్య పంటలు, పామాయిల్, పసుపు, కూరగాయలు, సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, గంజాయి సాగు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధనను మరింత బలోపేతం చేయాలని, యువతకు టాస్క్ ద్వారా ఐటీ, కమ్యూనికేషన్, డిజిటల్ మార్కెటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి రంగాల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు, పరిశుభ్రత, పచ్చదనం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, వ్యవసాయ అవగాహన కార్యక్రమాలు, బాల్యవివాహాల నిర్మూలన, రహదారి భద్రత, ఆరోగ్య కార్యక్రమాలు, యువజన సేవలు తదితర రంగాల్లో విశేష పురోగతి సాధించినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం, డీఆర్డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్రతో పాటు వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పోడు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

పెంచికలపేట్, జూన్ 25 (జనంసాక్షి) : పెంచికల్ పేట్ మండలం పరిధిలోని అటవీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడి పోడు వ్యవసాయం చేస్తున్న వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెంచికల్ పేట్ మండలంలోని దరోగపల్లి గ్రామానికి చెందిన డాంబర్ సుధాకర్, అనే వ్యక్తి దరోగపల్లి అటవీ భూమిలో అక్రమంగా చొరబడి పోడు వ్యవసాయం చేస్తుండగా నిందితున్ని ఫారెస్ట్ అధికారులు పట్టుకొని అదుపులోకి తీసుకోని అతనిపై అటవీ చట్టం ప్రకారం కేసునమోదు చేసి, నిందితున్ని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచగా, న్యాయమూర్తి అతనికి 14,రోజులజ్యుడిషియల్ రిమాండ్ విధించడం జరిగిందని అన్నారు. రేంజ్ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ, అక్రమంగా అటవీ భూములను ఆక్రమించి పోడువ్యవసాయం చేసిన, చెట్లను నరికిన, అడవి జంతులను వేటాడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి ముసవీర్, బీట్ అధికారులు, సతీష్, మనోహర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ఆత్మకూర్, జూన్ 25 (జనం సాక్షి): గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడంతో పాటు, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా కీలకమని, ప్రతి ఓటరికి తన హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని తెలిపారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, కమలాపురం రమేష్, కక్కెర్ల రాజు గౌడ్, పరికరాల వాసు, అలవాల రవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో రైతు మృతి



కుబీర్, జూన్ 25 (జనంసాక్షి) : కుబీర్ మండల పరిధిలోని సిర్పెల్లి (హెచ్) గ్రామంలో గురువారం ఉదయం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పొలానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై పబ్బు రాజన్న (62) అనే రైతు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రాజన్న ఉదయాన్నే తన వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి బయలుదేరారు. అయితే, పంట రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సోలార్ ఫెన్సింగ్ లైన్‌పై కరెంటు వైర్లు తెగిపడి ఉన్నాయి. గమనించకుండా ఆ సోలార్ ఫెన్సింగ్ లైన్‌ను దాటుతున్న క్రమంలో ఆయనకు విద్యుత్ షాక్ తగిలింది. కరెంటు షాక్ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పబ్బు రాజన్న అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుబీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి



**సూర్యాపేట, జూన్ 25 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కోదాడ ఎమ్మెస్ విద్యాసంస్థల సీఈఓ, వాసవి క్లబ్స్ రీజియన్ 8 జోన్ చైర్మన్, పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు సేకు శ్రీనివాసరావు కోరారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.నరసింహను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణయే ధ్యేయంగా, నిరంతరం ప్రజా సేవలో భాగస్వామ్యమవుతూ, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో షీ టీం, సైబర్ క్రైమ్, గంజాయి ,డ్రగ్స్ , మాదక ద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై పోలీసు అధికారులచే విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య పరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న జిల్లా ఎస్పీ కె.నరసింహ, జిల్లా పోలీసుల సేవలు అభినందనీయమని అన్నారు.

## విజ్ఞాన్స్ క్యాంపస్‌లో 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ



**భూదాన్ పోచంపల్లి, జూన్ 25 (జనం సాక్షి) :** మండలంలోని దేశ్‌ముఖి గ్రామ పరిధిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లో 100 అడుగుల ఎత్తైన భారత జాతీయ జెండాను ఆవిష్కరించారు. పచ్చని ప్రకృతి మధ్య రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం క్యాంపస్‌కు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో రూపొందించిన ఈ భారీ జెండాను విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసినట్లు యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య తెలిపారు. విద్యార్థుల్లో దేశసేవ, సామాజిక బాధ్యత భావాలను పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మురళీధర్ దేశ్‌పాండే మృతిపై ప్రభుత్వం స్పందించాలి

- కళాకారుల డిమాండ్

**ముషీరాబాద్, జూన్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమ కళాకారుడు, సకల కళల జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మృతిపై ప్రభుత్వం మౌనం వీడి స్పందించాలని కళాకారులు, ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు వక్తలు హాజరై మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారులను ఏకం చేసి కీలక పాత్ర పోషించిన మురళీధర్ దేశ్‌పాండేకు ప్రభుత్వం కనీసం అధికారిక నివాళి కూడా అర్పించకపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రాష్ట్రంలోని ఉద్యమ కళాకారులకు గుర్తింపు కార్డులు, నెలకు రూ.6,000 పింఛన్ అందించాలని కోరారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధికారిక సంస్మరణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన కళాకారులు మురళీధర్ దేశ్‌పాండే చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, నాయకులు ప్రఫుల్ రామ్ రెడ్డి, సుల్తాన్ యాదగిరి, విష్ణు కిషోర్, కొండూరు భాస్కర్, దప్పు స్వామి, గుంటి చంద్రయ్య, కోల జనార్ధన్, వి. సుభాష్ చంద్రబోస్, అంబాల నారాయణ గౌడ్, దండు సారంగపాణి, డోలక్ యాదగిరి, మంచాల వెంకటస్వామి, రాఘవేంద్ర స్వామి, అడ్వకేట్ ప్రతాప్, దమ్మిగారి కనకయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సర్వేను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 25 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే ప్రక్రియను సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఓటరుకు రెండు ఫారాలు అందజేయడంతో పాటు బీఎల్‌ఓలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత బీఎల్‌ఓకు తెలియజేసి సరిచేసుకోవాలని ప్రజలకు సూచించారు. కావాలని తప్పుడు సమాచారం అందించిన వారి విషయంలో ఫారంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. ఓటరు జాబితా పారదర్శకంగా, కచ్చితత్వంతో రూపొందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ లాలు, బీఎల్‌ఓ బంగారు పద్మ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## విధుల పట్ల అలసత్వం వేస్తే కఠిన చర్యలు



**నూతనకల్, జూన్ 25 (జనంసాక్షి) :** వైద్య సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రసిద్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ చరణ్ నాయక్ పిహెచ్‌ఎన్ దయామని వైద్య సిబ్బంది ఉన్నారు.

# యాదాద్రి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 25 (జనం సాక్షి) :** ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మోడల్ జిల్లాగా ఎంపికైన యాదాద్రి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో మోడల్ జిల్లాగా ఎంపికైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ఏబీడీఎం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ మరియు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ నమోదులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, ఫార్మసీలు మరియు వైద్య నిపుణులందరూ ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు మరియు ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా హెచ్ ఎఫ్ ఆర్, హెచ్ పి ఆర్ నమోదులు పూర్తి చేయాలని సూచించారు. వైద్యులచే జారీ చేయబడే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య రికార్డుల డిజిటల్ నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఏ బిడియం అమలును పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కమిటీలు, ఫీల్డ్ బృందాలు ఏర్పాటు చేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు వారాల్లో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన ఆరోగ్య సంస్థలు, వైద్య నిపుణుల నమోదులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఏబీడియం ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులు సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రతి పౌరునికి ఏ బి హెచ్ ఎ ఐ డి రూపొందించడం ద్వారా వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో అనుసంధానం చేయవచ్చు. రోగి అనుమతితో దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఏబిడియం-నమోదిత ఆసుపత్రిలోనైనా గత వైద్య చరిత్ర, పరీక్షా నివేదికలు, ప్రిస్క్రిప్షన్లు మరియు ఇతర ఆరోగ్య వివరాలను పరిశీలించి, వేగవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. దీంతో కాగితపు రికార్డుల అవసరం తగ్గి, అత్యవసర పరిస్థితుల్లో కూడా చికిత్స మరింత సమర్థవంతంగా అందుతుంది. రోగి అనుమతి లేకుండా ఆరోగ్య వివరాలను ఎవరూ చూడలేరు; గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుంది. ఈ సమావేశంలో డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జెడ్పి సీఈవో శోభరాణ, ఏబీడియం అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఏబీడియం స్టేట్ ట్రైనర్ సాయి కుమార్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు. ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, తదితరులు వున్నారు.

## వ్యర్థాల శుద్ధి ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సూర్యాపేట, జూన్ 25 (జనంసాక్షి) :** సూర్యాపేట మండలం బాలెంల గ్రామ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డును గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించి తనిఖీ చేశారు. డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఏ విధంగా శుద్ధి చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన బయో మైనింగ్ యంత్రం పనితీరు, దాని ద్వారా తడి, పొడి వ్యర్థాలను ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశాలపై అధికారులతో చర్చించారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన తడి చెత్తను త్వరగా శుద్ధి చేయాలని, ఎటువంటి చెత్త నిల్వ ఉండకుండా పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్, ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప సర్పంచులపై చెక్ పవర్ ఆరోపణలు ఖండించాలి



**ముషీరాబాద్, జూన్ 25 (జనం సాక్షి) :** చెక్ పవర్ విషయంలో ఉప సర్పంచులపై వస్తున్న ఆరోపణలను వెంటనే ఖండించాలని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో తమ హక్కులు, గౌరవాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ.. ఉప సర్పంచులకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం కల్పించాలని కోరారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలాఫలకాలపై సర్పంచులతో పాటు ఉప సర్పంచుల పేర్లను తప్పనిసరిగా పొందుపరచాలని, ఆయా వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సంబంధిత వార్డు సభ్యుల పేర్లను కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అధికార ప్రతినిధి కమలాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సప్పు, వైస్ ప్రెసిడెంట్ కవిత, శ్రీధర్ గౌడ్, మహేష్, పాషా, రాజు, రమేష్, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సరస్వతి నిలయంలో జల సంక్షోభం

- నీటి కోసం బాలికల అవస్థలు
- అధికారుల పర్యటనలకే పరిమితమైన పరిష్కారం



**భువనగిరి, జూన్ 25 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నీటి కొరత సమస్య తీవ్రరూపం దాల్చింది. సుమారు 300 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్న ఈ విద్యాలయంలో తాగునీరు, నిత్యావసర అవసరాలకు సరిపడా నీరు అందక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నీటి సమస్యను గుర్తించిన అప్పటి ఆర్డీవో భూపాల్ రెడ్డి ప్రభుత్వ నిధులతో బోరు ఏర్పాటు చేయించినప్పటికీ, అది వర్షాకాలంలో మాత్రమే కొంత ఉపశమనం కలిగిస్తోంది. ఎండాకాలం వచ్చేసరికి బోరులో నీటి మట్టం పడిపోవడంతో సమస్య మళ్లీ మొదటికొస్తోంది. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడిచినా వర్షాలు లేకపోవడం, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో నీటి కొరత మరింత తీవ్రమైంది. విద్యార్థినులు స్నానాలు చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా తగినన్ని నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు బాలికలు ఆరోగ్య సమస్యల కారణంగా సెలవులు తీసుకుని ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ కాలనీతో పాటు కేజీబీవీకి ప్రత్యేకంగా ట్యాంకర్లను కేటాయించినప్పటికీ, అవి సక్రమంగా నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు పలువురు పాఠశాలను సందర్శించినా, సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని బాలల హక్కుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి కేజీబీవీ విద్యార్థినులకు తగిన నీటి వసతులు కల్పించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు, బాలల హక్కుల సంఘం నాయకులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 25 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్‌ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్‌ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్‌ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్‌ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- ప్రతి ఓటరికి ఫారం అందాలని అధికారులకు ఆదేశాలు
- ఫిల్మ్‌నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్.వి.కర్ణన్
- పారదర్శకంగా ఎన్యుమరేషన్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు
- ఓటర్ల జాబితాల ఖచ్చితత్వానికి ఎన్యుమరేషన్ ప్రక్రియ కీలకమన్న బల్దియ బాస్



**ఖైరతాబాద్, జూన్ 25 (జనం సాక్షి):** ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ భధవత్ సంతోష్ , డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శంకర్‌లతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ నియోజక వర్గ పరిధిలోని ఫిల్మ్‌నగర్‌లో గ్యాని జైల్‌సింగ్ నగర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ఎన్యు మరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ, ఎన్నికల సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ.. ఎన్నిక ల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడైన ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జా గ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రక్రియను పారదర్శ కంగా, సమర్థ వంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వో లు, ఎన్ని కల సిబ్బందికి పలు సూచనలు చేసిన ఆయన, ఫా రాల పంపిణీతో పాటు ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేసి, నిర్ణీత గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల జాబితా ల ఖచ్చితత్వం కోసం ఎన్యుమరేషన్ ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాబార్డ్ సహకారంతో కోరమీను చేపల పెంపకంపై క్షేత్ర పర్యటన

- వడ్డేపల్లి ఉదయ్ ఆక్వా కనెక్ట్ యూనిట్‌ను సందర్శించిన సుందరగిరి మహిళలు



**చిగురుమామిడి జూన్ 25(జనంసాక్షి):** నాబార్డ్ వారి సౌజన్యంతో,జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన ఎల్ఈడీపీ శిక్షణ పొందుతున్న మహిళా సభ్యులకు కామారెడ్డి జిల్లా వడ్డేపల్లి గ్రామంలోని ఉదయ్ ఆక్వా కనెక్ట్ యూనిట్‌కు క్షేత్ర పర్యటన నిర్వహించబడిందని జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ పెసరి రాజు తెలిపారు.ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ రాథోడ్ సుధాకర్ సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ ద్వారా కోరమీను చేపల పెంపకం విధానాన్ని వివరించారు.ఒక యూనిట్ స్థాపనకు సుమారు రూ.4.41లక్షల వ్యయం అవుతుందని, అందు లో ప్రభుత్వం రూ.1.35లక్షల సబ్సిడీ అందిస్తుందని తెలిపారు.మిగిలిన మొత్తానికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించబడుతుందని చెప్పారు. ఈ వ్యవస్థలో 15,000లీటర్ల సామర్థ్యం గల వృత్తాకార ట్యాంకును ఏర్పాటు చేసి,నిరంతర ఆక్సిజన్ సరఫరా కోసం రింగ్ బ్లోవర్ సిస్టమ్‌ను వినియోగిస్తారని వివరించారు.చేపల ఆరోగ్య సంరక్షణ కోసం బయో-సెక్యూరిటీ ప్రమాణాలతో కూడిన షెడ్డు మరియు ట్యాంకులను నిర్మిస్తారని తెలిపారు. చేప పి ల్లల పెరుగుదల దశలో నీటి నాణ్యత, ఫీడింగ్ సైకిల్,ఆరోగ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు.ట్యాంకులో చేపలను నాలుగు నెలలపాటు పెంచి,400నుండి 500గ్రాముల బరువుకు చేరుకున్న తర్వాత చెరువులోకి వదులుతారని,మొదటి పంట కాలం సుమారు ఎనిమిది నెలలుగా ఉంటుందని వివరించారు.ట్యాంకు,చెరువు ఆధారిత చేపల పెంపకం ద్వారా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అలాగే చేపల పెంపకంలో ఉపయోగించిన నీటినే వ్యవసాయానికి వినియోగించడం ద్వారా భూగర్భ జలాల వినియోగం తగ్గడమే కాకుండా,యూరియా,ఇతర రసాయన ఎరువుల అవసరం కూడా తగ్గి భూసారం పరిరక్షించబడుతుందని వివరించారు.నాబార్డ్ సహకారంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న కోరమీను చేపల పెంపకం శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ క్షేత్ర పర్యటన రైతులు, మహిళా సభ్యులకు ఆధునిక చేపల పెంపక పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ పెసరి రాజు,మండల అధ్యక్షురాలు గందే రజిత, కమ్యూనిటీ అసోసియేట్లు వసంత, లత 30మంది స్వశక్తి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఫ్యూచర్ సిటీ డిసిపి శివం ఉపాధ్యాయ్
- పాఠశాల యాజమాన్యం పిల్లల పట్ల ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి



**మొయినాబాద్, జూన్ 25, జనంసాక్షి:** ప్రభుత్వ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని పాఠశాలల్లో నడువుతున్న యాజమాన్యం వారి బస్సులను ప్రతి రోజు డ్రైవర్లను, క్లీనర్లను పరిశీలించాలని, ఫ్యూచర్ సిటీ సిటి ట్రాఫిక్ డిసిపి శినం ఉపాధ్యాయ్ అన్నారు. గురువారం ముండల పరిధిలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో సుజాత ఇంటర్నేషనల్ పాఠశాలలో ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ్ తోపాటు ఏసీపీ చంద్రశేఖర్, సీఐ సతీష్, ట్రాఫిక్ బృందంతో కలిసి పాఠశాలను సందర్శించి బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసిపి ప్రతి బస్సు డ్రైవర్, క్లీనర్ను పూర్తి వివరాలు అడిగి తెలుసుకోని నూచనలు, సలహాలు అందించారు. అదే విధంగా బస్సులకు సంబంధించిన వజ్రాలను పరిశీలించారు. బస్సు డ్రైవర్లు ఆయాలతో కలిసి నమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ బస్సులను ఎంత ఉంటుందని డ్రైవర్‌లకు నూచించారు. బస్సులకు పర్మిట్ చేసి టప్పుడే 60 స్పీడ్ లాక్ చేయబడుతుంద ని ఆనతో వివరించారు. విద్యార్థులవట్ల ప్రయాణంలో డ్రైవర్లు ఆజాగ్రత్త, సిలో ఫోన్లు మాట్లాడవద్దు అని సూచించారు. ఎవరైనా డ్రైంక్ అండ్ డ్రైవ్ చేస్తే యాజమాన్యానిక పాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి పోలీసులకు దొరికితే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులను తీసుకువెళ్తున్న బస్సు డ్రైవర్ లతో పాటు క్లీనర్లు పిల్లలను దింపేటప్పుడు, ఎక్కించుకుసేటప్పుడు జాగ్రత్తలుపాటించా అన్నారు. పిల్లలు దిగగానే పరుగులు తీస్తారని రోడ్డుపై వాహనాలు స్పీడ్గా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతాయని సూచించారు. ఇందు కోసం ఆయాలు పిల్లలను దింపుతూ వారితో పాటు రోడ్డును దాటించాలని తెలియజేశారు. యజామాన్యం కూడా బస్సుల పట్ల డ్రైవర్లు, అటెండర్లపై నిఘా ఉంచాలని తెలిపారు. ఈ బస్సులతనిఖీల్లో ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నతీష్, పాఠశాల వైస్ ప్రిబ్సవల్ అనురాధా, ఏనో చంద్రశేఖర్, ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై చందర్ నాయక్, పోలీసులు జగన్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌బౌండ్-ఏపీ డ్రోన్ కార్పొరేషన్ అవగాహన ఒప్పందం



**ఖైరతాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎయిర్‌బౌండ్ సంస్థ, అమరావతి రాజధాని ప్రాంతంలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ (ఏపీడీసీ) తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చు కుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు సమక్షంలో ఏపీడీ సీ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ గీతాంజలి శర్మ మరియు ఎయిర్‌బౌండ్ వ్యవస్థాపకుడు, సీఈఓ నమన్ పుష్ప్ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కింద అమరావతి, విజయవాడ, గుంటూ రును అనుసంధానించే డ్రోన్ డెలివరీ సేవలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గుంటూరు నుంచి కార్యకలాపాలు ప్రారంభించి, రాష్ట్రవ్యాప్తంగా రోజు కు 10,000 డ్రోన్ విమానాలు నిర్వహించే లక్ష్యంతో ఇరు సంస్థలు పని చేయనున్నాయని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, లాజిస్టిక్స్, ఈ-కామర్స్ రంగాల కు వేగవంతమైన డెలివరీ సేవలు అందించడంతో పాటు పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలకు ఈ భాగస్వామ్యం దోహద పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కింజరాపు రామ్ మోహన్ నాయు డు, గీతాంజలి శర్మ, నమన్ పుష్ప్ భారతదేశంలో స్వదేశీ డ్రోన్ సాంకేతికత, వైమానిక లాజిస్టిక్స్ అభి వృద్ధికి ఈ భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

## అన్న అక్క మెంటార్షిప్‌లో ఏఐ,
# డిజిటల్ లెర్నింగ్‌పై విద్యార్థులకు శిక్షణ



**కరీంనగర్ టౌన్, జూన్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'అన్న అక్క మెంటార్షిప్' టీచింగ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో బీఎస్సీ ఫిజికల్ సైన్స్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లెర్నింగ్ అంశాలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ లిటరసీ పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శిక్షణ పొందిన కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగాధిపతి, నోడల్ ఆఫీసర్ ఎం. ఆంజనేయులు ఆధ్వర్యంలో జడల రమేష్, ప్రేమ్ చంద్, చౌదరి, వేములవాడ శ్రీనివాస్ తదితరులు శిక్షకులుగా వ్యవహరించారు. వారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్, అప్లికేషన్లు, కోడింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, డిజిటల్ లెర్నింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సాంకేతికతను సురక్షితంగా, బాధ్యతాయుతంగా వినియోగించే విధానాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు. కళాశాల నోడల్ అధికారులు మధు రాజేష్, డాక్టర్ ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ, శిక్షణ పొందిన ఐదో సెమిస్టర్ విద్యార్థులు జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 30 గంటలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు, సాంకేతిక అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య, ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, హర్ జ్యోత్ కౌర్, రేళ్ల సంజీవ్, ఎలిజబెత్ రాణి, డాక్టర్ ఎం. అర్చన, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ ఆర్. స్వరూప రాణి, డాక్టర్ టీ. కరుణాకర్, డాక్టర్ కే. రాజేష్, డాక్టర్ బండి అశోక్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యాశాఖలో మిస్టరీ ఆఫీసర్

- అక్రమ విద్యాధికారి లక్ష్మణ్ సింగ్‌పై జిల్లాలో జోరుగా చర్చ
- ఆర్జేడి కార్యాలయ కలెక్షన్ ఏజేంట్ అంటూ ఆరోపణలు
- మహబూబ్ నగర్‌లో చాలా కార్పోరేట్ పాఠశాలలకు అక్రమ అనుమతులు
- విచారణ కోరుతు సియంఓ కార్యాలయంలో ఫిర్యాదు

## రూరల్ ఎంపీడీఓ ఆఫీస్‌లో ఎంఈఓ ఫైళ్లు మాయం..!?

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి):**
మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీఓ ) వేదికగా సాగుతున్న అక్రమ పర్వం, నిబంధనల ఉల్లంఘనలు జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నిబంధనలకు పాతరస్తూ, ప్రభుత్వ వ్యవస్థలను తమకు అనుకూలంగా మ్యానిపులేట్ చేయడంలో దిట్టగా పేరుగాంచిన రూరల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) లక్ష్మణ్ సింగ్‌కు సంబంధించిన వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో రెగ్యులర్ ఎంఈఓగా విధులు నిర్వహించాల్సిన ఈ అధికారికి సంబంధించిన నియామక, బదిలీ ఉత్తర్వుల రికార్డులన్నీ కార్యాలయం నుండి రాత్రికి రాత్రే మాయమవ్వడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ప్రతి నెలా లక్షల రూపాయల ప్రభుత్వ వేతనాన్ని పొందుతున్న ఒక ఉన్నతాధికారికి సంబంధించిన పూర్తి సర్వీస్ రికార్డులు, జీతాల చిట్టా లోకల్ బాడీస్ కార్యాలయం నుండి కనుమరుగవ్వడం వెనుక స్థానిక సిబ్బంది హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సిబ్బందితో లాలూచీ పడి, భవిష్యత్తులో ఎలాంటి లీగల్ సమస్యలు రాకుండా ఉండేందుకే ఈ రికార్డులను మాయం చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రూరల్ ఖజానా నుంచి జీతం.. అర్బన్‌లో పెత్తనం**
సదరు ఎంఈఓకు పంచాయతీ రాజ్ శాఖ లోకల్ బాడీస్ నుంచే క్రమంగా వేతనం అందుతున్నప్పటికీ, ఆయన మాత్రం దానికి భిన్నంగా మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలో విధులను చట్టవిరుద్ధంగా నిర్వహిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో బహుశా ఎక్కడా లేని విధంగా, రూరల్ పరిధిలో పోస్టింగ్ ఉంచుకుని అర్బన్‌లో తిష్టవేయడం ఒక్క లక్ష్మణ్ సింగ్‌కే సాధ్యమైందని తోటి ఉద్యోగులే ముక్కున వేలేసుకుంటున్నారు. కేవలం పట్టణ పరిధిలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దొడ్డిదారిన లబ్ధి చేకూర్చేందుకే, నిబంధనలను తుంగలో తొక్కి ఒక ప్రత్యేక పోస్టింగ్‌ను క్రియేట్ చేయించుకుని ఆయన ఇక్కడ పెత్తనం చలాయిస్తున్నారనే చర్చ విద్యాశాఖ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇందులో లోకల్ బాడీ అధికారుల పాత్రపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బంగారు ఉంగరం బహుమతులు.. దొడ్డిదారి అనుమతులు?**
ప్రాంతీయ విద్యాశాఖ అధికారి ఆర్జేడీ కార్యాలయం ఒక ప్రైవేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ, అర్బన్‌తో ఎలాంటి చట్టబద్ధమైన సంబంధం లేని లక్ష్మణ్ సింగ్‌ను అక్కడ నియమించడం వెనుక పెద్దఎత్తున క్విడ్ ప్రో కో అవినీతి లాలూచీ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాఠశాలల గుర్తింపు, నిర్వహణకు సంబంధించి నిబంధనల ప్రకారం ఉండాల్సిన ఎలాంటి పత్రాలు, భద్రతా అర్హతలు లేకపోయినా సదరు కార్పొరేట్ పాఠశాలలకు యథేచ్ఛగా దొడ్డిదారిన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన ఒక ఉన్నతస్థాయి ఆర్జేడీకి సదరు అధికారి ఒక భారీ "బంగారు ఉంగరం" బహుమతిగా సమర్పించుకుని మరి ఈ లూప్‌హోల్ పోస్టింగ్‌ను దక్కించుకున్నారనే ప్రచారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఆనాటి పరిచయాలు, పలుకుబడితోనే నేటికీ ఎలాంటి ఫైళ్లు లేకుండానే కార్పొరేట్ స్కూళ్ల పనులు చక్కబెడుతున్నట్లు సమాచారం.

**ఆర్జేడీ ఆఫీస్ 'కలెక్షన్ ఏజెంట్'గా..**
జిల్లా విద్యాశాఖ అధికారుల (డీఈఓ) పరిధిని, ఆదేశాలను సైతం పూర్తిగా పక్కనబెట్టి, సదరు ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ నేరుగా హైదరాబాద్‌లోని ఆర్జేడీ కార్యాలయ సిబ్బందితోనే రహస్య దందాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి అధికారులకు సమాచారం లేకుండా, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల నుంచి వస్తున్న భారీ వసూళ్లను, మామూళ్లను నేరుగా పైస్థాయి అధికారులకు చేరవేసే ఒక నమ్మకమైన 'కలెక్షన్ ఏజెంట్'లా ఈ అధికారి వ్యవహరిస్తున్నారని స్వయంగా తోటి ఉద్యోగులే బహిరంగంగా ఈసడించుకుంటున్నారు. తాము అర్బన్ పరిధిలో ప్రైవేట్ వ్యవహారాలు నడుపుతున్నా, పంచాయతీ రాజ్ శాఖ రూరల్ నిధుల నుండి క్రమంగా జీతాలు వస్తుండటం వెనుక.. లోకల్ బాడీ కార్యాలయంలోని పలువురి చేతులు కూడా తడిపారనే విమర్శలకు బలం చేకూరుతోంది. అందుకే అక్కడ రికార్డులు మాయం అయ్యాయని భావిస్తున్నారు.



**దిష్టిబొమ్మల దహనం :**
రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సాగుతున్న ఈ ఆర్జేడీ కార్యాలయ అక్రమ దందాపై మహబూబ్‌నగర్‌లోని పలు విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలో సదరు అధికారుల అవినీతికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శన లు చేపట్టి, దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇప్పడు ఆర్జెడి కార్యలయ ఏజేంట్లకు సంభంధించి మహబూబ్‌నగర్‌లో పెద్దయెత్తున్న చర్చ సాగుతుంది.

# మత్తుకు దూరంగా.. చదువుకు దగ్గరగా

**వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు**



**వేములవాడ రూరల్, జూన్ 25 (జనంసాక్షి):** హనుమాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి భారీ మానవహారం ఏర్పాటు చేసి, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల వైపు సాగాలన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో విద్యార్థుల సామాజిక నాటికలు, పోస్టర్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటరాజం, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో పాల్గొని పర్యవేక్షించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి

**మ్యాపింగ్ కాని ఓటర్లను కొత్త ఓటర్లుగా నమోదు చేపించాలి.**



**కరీంనగర్ అర్బన్, జూన్ 25 (జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నగరంలోని 47వ డివిజన్ లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అసలైన ఓటరు ఏఒక్కరికి అన్యాయం జరుగవద్దని మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుతో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ బిఎల్ఏ లు దగ్గరుండి చూసుకోవాలని, మ్యాపింగ్ అయిన వారి ఎన్యూమరేషన్ పత్రాలు దగ్గరుండి నింపించి బిఎల్ఓ ద్వారా అప్ లోడ్ చేపించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్ నింపించి ఇవ్వకపోతే డ్రాఫ్ట్ లిస్ట్ లో ఓటు నమోదు కాదు అందుకని తప్పకుండా ప్రతి ఎన్యూమరేషన్ ఫామ్ తప్పకుండా నింపించి ఇవ్వాలని బిఎల్ ఏ లకు సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్ఐ శ్రీనివాస్, బిఎల్ఓ సునీత, బిఎల్ఓ సూపర్‌వైజర్ జమున, శ్రీనివాస్ గౌడ్, కేశవ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

- త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం
- ప్రమాదాలు జరగకుండా కట్టుబడి చర్యలు
- ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పని
- సురక్షిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్త



**రామగిరి, జూన్ 25 (జనం సాక్షి):**
ఉద్యోగులు ఎల్లప్పుడూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని హైదరాబాద్ రీజియన్-2 డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) డాక్టర్ సాగేష్ కుమార్ మాధవన్ రామచంద్రన్ అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని సి.ఎన్.సి.ఓ.ఎ క్లబ్‌లో గురువారం గుర్తింపు సంఘం (ఎఐటియుసి) డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి. రావు అధ్యక్షతన 20వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి. శంకర్ గత త్రైపాక్షిక సమీక్షలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏరియాలో గత కొద్ది సంవత్సరాలుగా జరిగిన వివిధ రకాల ప్రమాదాల గణాంకాలు తెలియజేశారు. ఏరియాలో ప్రమాదాలు జరగకుండా భద్రతా పరంగా వివిధ గనులు, విభాగాల లో తీసుకుంటున్న చర్యలను ఎస్వోటు జియం బండి సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ గనుల వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు తమ తనిఖీలో దృష్టికొచ్చిన విషయాలను తెలియజేశారు.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తరఫున హాజరైన అధికారులు తమ తనిఖీలో దృష్టికొచ్చిన అంశాలు తెలియజేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ డి.జి.ఎం.ఎస్. అధికారులు అందించిన సూచనలు తప్పకుండా పాటిస్తామని, భద్రతా పరంగా లోటుపాట్లు రాకుండా చూస్తామని తెలిపారు.

మహిళా ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేవని, పని ప్రదేశాల్లో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రతా పరంగా యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు తమ సహకారం తప్పకుండా ఉంటుందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ యం. మల్లయ్య, రెస్క్యూ విభాగం జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థను ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలిపారు. డి.ఎం.ఎస్. (మైనింగ్) డాక్టర్ సాగేష్ కుమార్ మాధవన్ రామచంద్రన్ మాట్లాడుతూ భద్రత పట్ల నిర్లక్ష్యం చేయొద్దని, పని ప్రదేశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాల నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రత విషయంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని, విషయాలను యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రమాదరహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి. రావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ఉద్యోగులందరూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో కూడిన విధులు నిర్వహించాలని కోరారు. భద్రత విషయంలో యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని, గత ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిడియంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ ప్రభాకర్, డిడియంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి, డిడియంఎస్ (మెకానికల్) డాక్టర్ కౌశిక్ సేన్ గుప్తా, ఎస్వోటు జియంలు బండి సత్యనారాయణ, యం. రామ్మోహన్, ఏరియా ఇంజనీర్లు ఉదయ భాస్కర్, దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, వివిధ గనుల మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, విభాగాల అధిపతులు, అధికారులు, సేఫ్టీ ఆఫీసర్లు, సంక్షేమ అధికారులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్టర్ల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు పల్స్ పోలియో

- నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలి
- నులి పురుగుల మాత్రలు పకడ్బందీగా పంపిణీ చేయాలి
- ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి);** ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పల్స్ పోలియో, నులిపురుగుల మాత్రల పంపిణీ,సీజనల్ వ్యాధుల సన్నద్ధతపై వైద్య ఆరోగ్య శాఖ,వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీతో కలిసి డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. పల్స్ పోలియో పై రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్,అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలు 41,147 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 393 వాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 38 సూపర్ వైజర్లను నియమించామని వెల్లడించారు. 15 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీడీఓలు, మెడికల్ అధికారులతో కలిసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి తమ పరిధిలోని 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వాక్సిన్ వేయించాలని, ఈ విషయమై అన్ని విద్యాలయాలలో ప్రార్దన సమయంలో, నోటీసు బోర్డులో రాయించాలని, మహిళా సంఘాల సమావేశాల్లో దీనిపై చర్చించాలని సూచించారు. అన్ని అంగన్వాడి కేంద్రాల పరిధిలో 0 నుంచి ఐదేండ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వాక్సిన్ అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల పరిధిలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పిల్లలకు వాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు వారికి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,33,695 మందికి జూలై (వచ్చే నెల) 13వ తేదీన వేస్తారని, అదే నెల 20వ తేదీ వరకు ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు వారికి అందేలా పకడ్బందీ ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని సూచించారు. లక్ష్యాన్ని పూర్తి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డెంగీ వ్యాప్తి చేసే దోమలు నిలువ ఉన్న మంచి నీటిలో పెరుగుతాయని తెలిపారు. వానాకాలం నేపథ్యంలో మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అన్ని ఇండ్లలో పాత టైర్లు, కూలర్లు, ఇతర పాత్రలు, ఇంట్లో, ఇంటి ఆవరణలో నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు.

నిలువ నీటిని తొలగించాలని తెలిపారు. ఫాగింగ్ యంత్రాలు పూర్తి స్థాయిలో వినియోగించాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయా లలో పారిశుధ్య పనులు చేయించాలని, ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, దీంతో అన్ని వ్యాధులు దూరం అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఇట్టి సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, వైద్యులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి
- పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- కరీంనగర్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పర్యవేక్షణ

**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి) :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ నగరంలోని 46వ డివిజన్ ప్రగతినగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లతో కలిసి పరిశీలించారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారు, ఎన్ని గంటలకు ప్రారంభించారు, కార్యాచరణ ప్రణాళిక ఎలా రూపొందించుకుంటున్నారు, త్వరగా పూర్తి చేయడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ, ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. అలాగే కలెక్టర్ ఓటర్లతోనూ మాట్లాడారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించుకుంటే కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర శాఖల సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తామని కలెక్టర్ తెలిపారు. మహిళా సంక్షేమ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక నిర్దిష్ట షెడ్యూల్, ప్రణాళిక ప్రకారం ప్రతి ఇంటిని సందర్శిస్తూ, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని, అర్హులైన ప్రతి ఓటరుకు సమాచారం చేరేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ రాజేష్, సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.





# దేశంలో 23వ ర్యాంకు సాధించిన ఓద్యారం పాఠశాల

- రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి విజయయాత్ర
- గంగాధర మండలానికి గర్వకారణం : ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం
- ప్రభుత్వ పాఠశాలలే దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మలు
- ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం అభినందనలు

**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనంసాక్షి):** తన చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ఓద్యారం 2025-26 జాతీయ స్థాయి రేటింగ్లో దేశంలో 23వ ర్యాంకు, తెలంగాణలో 5వ ర్యాంకు సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం గంగాధర మండలానికే కాకుండా మొత్తం చొప్పదండి నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మల వంటివని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. 2017-18లో పాఠశాల రాష్ట్ర స్థాయి అవార్డు సాధించినప్పుడు కూడా తాను ఎంతో సంతోషించానని, ఇప్పుడు అదే పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. జడ్పీహెచ్ఎస్ ఓద్యారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల చూపుతున్న కృషి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతినిధులు పాల్గొన్నారు. "రాష్ట్ర స్థాయి గుర్తింపు ఆనందాన్ని ఇచ్చింది. జాతీయ స్థాయి విజయం గర్వాన్ని కలిగించింది. ప్రభుత్వ పాఠశాలలే దేశానికి నిజమైన పట్టుకొమ్మలు" అని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం పేర్కొన్నారు.

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ముస్తాబాద్ జూన్ 25 (జనంసాక్షి) :**



ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో మహిళా, శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల యొక్క హక్కులు, చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి మహిళా సాధికారత జిల్లా కేంద్రం కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళలు ఏ సందర్భంలోనైనా హింసలకు గురైనట్లయితే అది శారీరకంగా, మానసికంగా, లైంగికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కావచ్చు ఇబ్బంది ఎదురైనప్పుడు మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి 181 మహిళా హెల్ప్ లైన్ నెంబర్ కి కాల్ చేసినట్లయితే సఖి కేంద్రం ద్వారా కౌన్సిలింగ్, పోలీస్, వైద్య, న్యాయ, తాత్కాలిక నివాసము వంటి సేవలు తక్షణమే ఉచితంగా వారికి అందించబడుతుందని, మరియు బాధిత మహిళల యొక్క వివరాలను గోప్యంగా ఉంచబడతాయని ఈ సేవలు అన్నీ కూడా 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలపడం జరిగింది అలాగే మహిళలకు సంబంధించిన గృహహింస నిరోధక చట్టం, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం,పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం గురించి వివరించడం జరిగింది. అలాగే ప్రస్తుత కాలంలో యువత మాదకద్రవ్యాల సేవించి వారి యొక్క ఆరోగ్యాన్ని ,బంగారు భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారని అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీటి సునీత వెంకటనర్సింగరావు గ్రామ పంచాయతీ సెక్రెటరీ రత్నకుమారి ,గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రవణ్ కుమార్, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది దేవిక, గ్రామ ఉపాధి హామీ కూలీలు పాల్గొనడం జరిగింది

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. ఎస్పి పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర
- డ్రగ్స్ సమాచారాన్ని పోలీసులకు అందించండి
- మాదక ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 25 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి నిజాంసాగర్ చౌరస్తా వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు మూలస్తంభమని, మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగుతోందని చెప్పారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసు శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. . ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, జిల్లా సంక్షేమ అధికారి కుమారి ఐ. ప్రసన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం దుకాణాలకు బహిరంగ వేలం

మల్లాపూర్,జూన్25(జనంసాక్షి) : మండలంలో రోజురోజుకు అక్రమ మద్యం దుకాణాలకు గ్రామాభివృద్ధి కమిటీలు బహిరంగంగానే అక్రమవేలం పాటలను నిర్వహిస్తున్నారు. మండలంలోని ఒక గ్రామంలో రెండు మద్యం దుకాణాలకు గాను 17 లక్షల రూపాయలు వేలంపాట పాడి దక్కించుకోవడం చర్చనీ అంశంగా మారింది. ఇంత జరిగినా గాని సంబంధిత అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్లు ఉండడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలలోఉదయం8 గంటలనుండి రాత్రి 12 గంటల వరకు అక్రమ మద్యం బెల్టు దుకాణాలను నిర్వహించడంతో రెక్క ఆడితే డొక్కాడని పేద మధ్యతరగతి వారు తాగుడుకు బానిసలై కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. ఇంత జరిగినా కానీ పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ప్రధాన రహదారుల పక్కనే దాబాల పేరుతో బార్లను మించి దాబాలలో మద్యం సిట్టింగులు నిర్వహిస్తున్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ట్రాఫిక్, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు
- 150 మంది గ్రేహౌండ్స్కు ప్రత్యేక శిక్షణ
- డ్రగ్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచనలు




**కరీంనగర్ బ్యూరో, జూన్ 25 (జనం సాక్షి):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 4వ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం, అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాల్'లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్ను విద్యార్థులకు ప్రదర్శించారు. చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయని కళ్లకు కట్టినట్లు చూపించింది. సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా, స్పోర్ట్స్, శారీరక వ్యాయామం పై దృష్టి సారించాలని సూచించారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాసంస్థల పరిసరాల్లోని 99 పాన్ షాపులపై దాడులు నిర్వహించి 52 కేసులు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కమీషనరేట్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్స్' ఏర్పాటు చేశామని తెలిపారు. "సే నో టూ డ్రగ్స్ – సే ఎస్ టూ లైఫ్" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. యువతలో స్వీయ నియంత్రణ ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలకు సిపి గౌష్ ఆలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'సంతకాల సేకరణ బోర్డు'పై సంతకాలు చేసి కరీంనగర్ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు. ఈ సదస్సులో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సరస్వతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి, ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

# టీజీఐఎల్పి కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన

**కొడంగల్, జూన్ 25 (జనం సాక్షి):** కోడంగల్ మండలం రుద్రారం గ్రామంలో టీజీఐఎల్పి ప్రోగ్రాం కింద లబ్ధిదారులకు అందించిన జీవనోపాధి కార్యక్రమాల అమలు తీరును గురువారం ఆగ ఖాన్ ఫౌండేషన్ గ్లోబల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి అమెరికా నుంచి టింబర్లీ మేడం, ఢిల్లీ నుంచి పల్లవి మేడం గ్రామాన్ని సందర్శించి, ప్రోగ్రాం కింద లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేసిన వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. కొంతమంది లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి, వారికి అందించిన కార్యక్రమాలు ప్రస్తుతం ఎలా అమలవుతున్నాయి, వాటి ద్వారా ఎలాంటి ప్రయోజనాలు పొందుతున్నారనే విషయాలను ప్రత్యక్షంగా మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే లబ్ధిదారులు చేపడుతున్న జీవనోపాధి కార్యకలాపాలను పరిశీలించి వారి అభిప్రాయాలు, అనుభవాలను సేకరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ద్వారా గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్న తీరును గ్లోబల్ టీమ్ సభ్యులు తెలుసుకున్నారు. కార్యక్రమాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఎల్పి జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్, కొడంగల్ ఏపీఎం పి. గోపాల్, సీసీ బసంత్ కుమార్, ఆక్టివిస్టులు, కోచ్లు, వీఓఏ సభ్యులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- బిఎల్ఏలు ప్రత్యేక దృష్టి సారించాలి : ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 25 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలం చింతల్ఠన గ్రామంలో సర్ పై కాంగ్రెస్ బిఎల్ఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఏఐసిసి పిసిసి పిలుపు మేరకు నేడు అర్బన్ మండలంలోని కాంగ్రెస్ (బూతు లెవల్ ఏజెంట్లకు) బిఎల్ఎలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో 2002లో ఓటర్ సవరణ కార్యక్రమం చేపడితే మళ్లీ నేడు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ బిఎల్ఓ ల దగ్గర ఉన్న ఓటర్ లిస్టులో తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు ఒక సామాజిక అవగాహనగా ఓటర్ లిస్టులో తమ పేరు ఉందో లేదో ప్రజలకు సమాచారాన్ని చేరవేయాలన్నారు. బిఎల్ఏ లు ఎన్నికల సంఘం అనామలిష్(నిషేధిత) లిస్టులో చేర్చిన ఓట్లను సరిచేసే వారికి సమాచారాన్ని చేరవేయాలని, ఓటర్ లిస్టులో ఏదైనా కారణంతో పేర్లు లేకపోతే దరఖాస్తు ఫారం నింపి సంబంధిత సమాచారాన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు చేరవేయాలన్నారు. గల్ఫ్ వెళ్ళిన వారు, విదేశాల్లో చదువుతున్న వారి వివరాలు వారి కుటుంబ సభ్యులు బిఎల్ఏ లకు వివరాలు ఇవ్వాలన్నారు. వారి కుటుంబ సభ్యులు అఫిడవిట్ రూపంలో అధికారులకు వివరాలు సమర్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు, మైకులో చెప్పి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నమన్నారు.

ఇప్పటికి చాలా గ్రామాల్లో 80 శాతం పైగా ఓటర్ మ్యాపింగ్ కావడం జరిగిందన్నారు. రెండు రోజుల క్రితం నియోజకవర్గ స్థాయిలో బిఎల్ఏలు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశమన్నారు. బీజేపీ ప్రమాదకరంగా మరి ప్రశ్నించే గొంతులను, ప్రతిపక్ష వారి ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రశ్నించే గొంతులను తొక్కలని చేస్తుందని, బీజేపీ ఓట్ల చోరీ చేస్తూ దేశంలో ప్రమాద కారణంగా మారిందన్నారు. బెంగాల్, తమిళనాడు, వంటి రాష్ట్రాల్లో బీజేపీకి నచ్చని వారి ఓట్లు లక్షల్లో తొలగిస్తుందని, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో 36 వేల ఓట్లు తొలగించారన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల ఓట్లు తొలగించే కుట్ర బీజేపీ చేస్తుందన్నారు. తమకు నచ్చిన వారి ఓటును ఉంచి నచ్చని వారి ఓట్లను తొలగిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటర్ లిస్టులో తమ ఓటు ఉందో లేదో ఒకసారి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- కామారెడ్డి నియోజకవర్గంలో యూరియా కొరత లేదు
- ఎస్ఐఆర్లో తన వివరాలు నమోదు చేసుకున్న షబ్బీర్
- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి
- ఓటరు జాబితా సవరణలో పారదర్శకత అవసరం



**కామారెడ్డి, జూన్ 25 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, జిల్లాలో యూరియా కొరత లేదని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యూరియా నిల్వలు, పంపిణీ విధానం, రైతుల అవసరాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. గత సంవత్సరం జూలై వరకు 106 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు గుర్తు చేసిన షబ్బీర్ అలీ, ఈ సంవత్సరం జూన్ 20 నాటికే 140 మెట్రిక్ టన్నులు అందించినట్లు వెల్లడించారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత యూరియా నిల్వలు జిల్లాకు తరలిస్తున్నామని, రేపు సాయంత్రం వరకు కొత్త స్టాక్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నిరంతర సరఫరా కొనసాగుతుందని భరోసా ఇచ్చారు.

కొంతమంది ప్రతిపక్ష నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం యూరియా కొరత ఉందంటూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు అలాంటి ప్రచారాలను నమ్మకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

అదే సమయంలో కామారెడ్డి పట్టణంలోని తన నివాసంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తన ఓటరు వివరాలను నమోదు చేసుకున్నారు. ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగంపై ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, అనర్హమైన లేదా డూప్లికేట్ ఓట్లు జాబితాల్లో కొనసాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బస్సు యాత్రలు సిగ్గుచేటు

- లంబాడాలను ఎస్టీల నుంచి తొలగించే కుట్ర
- లంబాడాలకు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టే యత్నం
- సిఎం రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు



**హైదరాబాద్, జూన్25 (జనంసాక్షి) :** ఎస్టీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ బస్సు యాత్రలు చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి ఆదివాసీలతో సుప్రీంకోర్టులో కేసు వేయించారు. లంబాడాలకు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి లంబాడాలు కర్రు కాల్చి వాతలు పెట్టడం ఖాయమన్నారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అంగన్‌వాడీల రిక్రూట్ మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి తెరలేపింది అని మాజీ మంత్రి విమర్శించారు. గురువారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అంగన్ వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. అంగన్‌వాడీలకు కేసీఆర్ ప్రభుత్వం పీఆర్సీ ఇచ్చిందన్నారు. ప్రతిసంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కలెక్టర్లు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. అంగన్‌వాడీ రిక్రూట్ మెంట్ కు ఇచ్చిన కొత్త జీఓను మార్చాలన్నారు. మినీ అంగన్ వాడీలను కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అప్ గ్రేడ్ చేశాం. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మేము అప్ గ్రేడ్ చేసిన వాటిని మరోసారి మినీ అంగన్ వాడీలను అప్ గ్రేడ్ చేస్తూ తొలి సంతకం పెట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు వారికి జీతాలు ఇవ్వడం లేదు. అంగన్ వాడీ వ్యవస్థను అవినీతి మయం చేశారని మండిపడ్డారు. అంగన్ వాడీ టీచర్లకు రూ.13,650 జీతం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పారదర్శకంగా అంగన్ వాడీ నియామకాలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీ వారి కార్యకర్తలకు దోచిపెట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. దీంతో అర్హులు అంగన్ వాడీ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

## పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?

**నల్గొండ, జూన్25 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా (38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తు న్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువు తోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

# ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

- ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'
- నిర్జల ఏకాదశి పర్వదినంతో కర్రపూజ నిర్వహించిన ఉత్సవ కమిటీ




**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** ఖైరతాబాద్ బడా గణెళిశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ గణెళిష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణెళిష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణెళిశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణెళిశుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ పూజా కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఏడాది కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాబోయే వినాయక చవితి పండుగ నాటికి, అంటే కేవలం 82 రోజుల్లోనే అన్ని హంగులతో కూడిన 70 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు సమసిపోయి, శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈ సారి ఖైరతాబాద్ గణెళిశుడిని 'పంచముఖ సంకట హార మహా గణపతి' రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భారీ విగ్రహానికి కుడి వైపున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని, ఎడమ వైపున భక్తులను రక్షించే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. లోకకల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.


# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

- జూలై 1నుంచి కొత్త ఫీజులు అమలు

**న్యూఢిల్లీ, జూన్25 (జనంసాక్షి) :** కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్ పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి. తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసుగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టు కోసం ఇకపై రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లు పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు కోసం రూ.4,250, తత్కాల్ స్కీమ్ కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటే రూ.6,750 చెల్లించాల్సి ఉంటుంది. మేరకు విదేశాంగ శాఖ పాస్‌పోర్టు నిబంధనలకు మార్పులు చేసింది. 2012లో చివరిసారిగా కేంద్రం పాస్ పోర్టు ఫీజులను సవరించింది. సాధారణ విధానంలో దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు పాస్‌పోర్టు జారీ అవుతుందన్న విషయం తెలిసిందే.

# ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

## కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు




**న్యూఢిల్లీ, జూన్25 (జనంసాక్షి) :** వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

# భూకంపాలపై గూగుల్ ముందే హెచ్చరికలు

- స్మార్ట్ ఫోన్లకు అలర్ట్‌లు పంపిన గూగుల్
- సోషల్ మీడియాలో స్క్రీన్ షాట్లు ప్రత్యక్షం

**కారకస్, జూన్25 (జనంసాక్షి) :** వందేళ్లలోనే ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లాడిపోతోంది. వరుసగా రెండు శక్తిమంతమైన భూకంపాల ధాటికి అనేక భవనాలు నేలమట్టమై లక్షలాది మంది ప్రజలు వీధినపడ్డారు. కాగా.. ఈ భూకంపాలు సంభవించడానికి కొన్ని క్షణాల ముందు గూగుల్ పలు స్మార్ట్‌ఫోన్లకు దీని గురించి అలర్ట్‌లు పంపించినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ అలర్ట్‌లు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత కాసేపటికే భూకంపాలు సంభవించాయి. అధునాతన స్మార్ట్‌ఫోన్లలో యాక్సిలరోమీటర్ అనే పరికరం ఉంది. సాధారణంగా ఇది ఒక సెన్సార్. మీరు ఫోన్‌ను అడ్డంగా పట్టుకున్నప్పుడు స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా తిప్పుతుంది. అయితే, దీని వల్ల మరో ఉపయోగం కూడా ఉంది. ఈ సెన్సార్ కంపనాలను కూడా గుర్తించి కొలవగలదు. మనం ఉంటున్న ప్రాంతంలో భూమి నుంచి వెలువడే వైబ్రేషన్స్‌ను ఇది సేకరిస్తుంది. ఇవి భూకంపానికి దారితీసేంత బలంగా ఉంటే.. వెంటనే గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్‌కు సిగ్నల్ పంపిస్తుంది. సుమారుగా ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం ఉందో కూడా చెబుతుంది. ఒక స్మార్ట్‌ఫోన్ నుంచి ఈ సిగ్నల్ అందిన వెంటనే.. గూగుల్ సర్వర్ ఆ ప్రాంతంలోని మిగతా ఫోన్లలోని యాక్సిలరోమీటర్లను పరిశీలిస్తుంది. అత్యధిక ఫోన్లు ఇలాంటి ప్రకంపనలే గుర్తిస్తే.. వెంటనే భూకంపం వస్తుందని అంచనా వేసి ఆ ప్రాంతానికి అలర్ట్స్ పంపిస్తుంది. ఈ పక్రియ శరవేగంగా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ ఉన్నట్లు గూగుల్ తెలిపింది. సాధారణంగా భూకంపం అనేది ఒక్కసారిగా వచ్చే కుదుపు కాదు. తరంగాల రూపంలో సంభవిస్తుంది. తొలుత ప్రైమరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు ఆరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆ తర్వాత సెకండరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు 3-4 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. భూకంపం వల్ల జరిగే అత్యధిక నష్టానికి ఈ తరంగాలే కారణం. ఇక, మన స్మార్ట్‌ఫోన్లు గుర్తించేవి ప్రైమరీ వేవ్స్‌నే. ఇవి రాగానే సర్వర్‌కు సిగ్నల్ ఇస్తాయి. అందువల్ల.. సెకండరీ వేవ్స్ రావడానికి ముందే గూగుల్ సర్వర్లు సమాచారాన్ని సేకరించి అలర్ట్ ఇవ్వడానికి సమయం లభిస్తుందని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. ఆండ్రాయిడ్ ఫోన్లు రెండు రకాల అలర్ట్‌లు ఇస్తుంటాయి.

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే..

- బహుభార్యత్వం కూడా సమర్థనీయమే
- మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు
- తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు




**ముంబై, జూన్25 (జనంసాక్షి) :** మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్-ఎ-హసన్, తలాక్-ఎ-అహ్సన్, తలాక్-ఎ-బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.



# సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్వప్నలోక్ కాంప్లెక్స్ పక్కన ఉన్న సూర్య కిరణ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం నుంచి పొగ, మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా భవనంలోని పలు అంతస్తులు పొగతో నిండిపోయాయి. భవనంలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తరలించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో భవనంలో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

- వాటిని పరిరక్షిస్తేనే భవిష్యత్
- గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి
- నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు



**బళ్లారి, జూన్ 25 (జనంసాక్షి) :** దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు. రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని వ్యాఖ్యానించారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని చంద్రబాబు అభివర్ణించారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుందని చెప్పారు. తుంగభద్ర.. మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలని చంద్రబాబు అన్నారు. ఇకపోతే కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

# సుచరిత నివాసంలో మరోమారు ఏసీబీ సోదాలు



**హైదరాబాద్, జూన్ 25 (జనంసాక్షి) :** శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత నివాసంలో మరోసారి ఏసీబీ సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల కే సులో తనిఖీలు చేస్తోంది. ఆమెకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మే 26న తొలివిడత కింద రూ.2 లక్షల సొమ్మును ప్రైవేటు డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా పట్టుబడ్డారు. దీంతో సుచరితను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోనే మరోసారి ఏసీబీ సోదాలు కొనసాగిస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370